ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి

జిల్లా వార్తలు

మంగళవారం 23 జనవరి 2024

జిల్లా ఓటర్లు

12,73,591





నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
అనకాపల్లి	1,01,744	1,09,148	5	2,10,897
చోడవరం	1,04,450	1,10,561	6	2,15,017
మాడుగుల	91,291	95,921	11	1,87,223
ఎలమంచిలి	99,340	1,04,724	9	2,04,073
పాయకరావుపేట	1,21,911	1,25,595	2	2,47,508
నర్సీపట్నం	1,01,312	1,07,556	5	2,08,873
మొత్తం	6,20,048	6,53,505	38	12,73,591

- పురుషుల కంటే మహిళలు 33,457 మంది అధికం
- ముసాయిదా జాబితాలతో పోలిస్తే 15,884 మంది పెరుగుదల
- 2019 ఎన్నికలకన్నా 24,626 మంది ఓటర్లు అధికం

అత్యధికం పాయకరావుపేటలో 2,47,508 మంది

- అత్యల్పం మాడుగులలో 1,87,223 మంది ఓటర్లు
- అన్ని సెగ్మెంట్లలో మహిళా ఓటర్లదే పైచేయి..

- నర్సీపట్నం నియోజకవర్గంలో 1,402 ఓటర్లు తగ్గుదల
- తుది జాబితాలను విడుదల చేసిన జిల్లా రిటర్నింగ్ అధికారి రవిపట్టన్‌శెట్టి

అనకాపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి):

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా అధికారులు తుది ఓటర్ల జాబితాను శుక్రవారం ప్రకటించారు. కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించిన అనంతరం తుది ఓటరు జాబితాలను మీడియాకు విడుదల చేశారు.

జిల్లాలోని ఆరు (అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి, పాయకరావుపేట, చోడవరం, మాడుగుల) అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 12,73,591 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 6,20,048 మంది, మహిళలు 6,53,505 మంది, ఇతరులు 38 మంది ఉన్నారు. సుమారు మూడు నెలల ప్రకటించిన ముసాయిదా ఓటరు జాబితాలతో పోలిస్తే తుది ఓటరు జాబితాల్లో 15,884 మంది పెరిగారు. గత ఏడాది అక్టోబరు 27న విడుదల చేసిన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం ఓటర్లు 12,57,707 మంది ఓటర్లు ఉండగా తుది ఓటరు జాబితాలో 69,488 మంది కొత్తగా కలిశారు. ఇక చనిపోయిన, వలస వెళ్లిన, డబుల్ ఎంట్రీలకు సంబంధించి 53,604 మంది పేర్లను జాబితాల నుంచి తొలగించారు. నికరంగా 15,884 మంది ఓటర్లు పెరిగాయి.



నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఓటరు జాబితాలను ప్రదర్శిస్తున్న ఆర్డీవో జయరాం

ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో మహిళా ఓటర్లు 6,44,516 మంది ఉండగా తుది జాబితాలో 6,53,505 మంది ఉన్నారు. పురుష ఓటర్లు ముసాయిదా జాబితా ప్రకారం 6,13,144 మంది ఉంటే.. తుది జాబితాలో 6,20,048 మందికి పెరిగారు. ఉన్నారు. మహిళా ఓటర్లు 8,989 మంది, పురుష ఓటర్లు 6,904 మంది పెరిగారు. ఇతరులు ముసాయిదా జాబితాలో 47 మంది వుండగా, తుది జాబితాలో 9 మంది తగ్గి, 38 మంది మిగిలారు.

మొదటి స్థానంలో 'పేట.. చివరి స్థానంలో మాడుగుల

నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే 2,47,508 మంది ఓటర్లతో పాయకరావుపేట మొదటి స్థానంలో వుంది. 1,87,223 మంది ఓటర్లతో మాడుగుల చివరి స్థానంలో ... మిగతా 8వ పేజీలో

గత ఎన్నికల కంటే 24,626 మంది ఓటర్లు అధికం

- నర్సీపట్నంలో మైనస్ 1,402!

ఇదిలా వుండగా 2019 ఎన్నికల సమయంలో అప్పటి ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఉన్న ప్రస్తుత అనకాపల్లి జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 12,48,965 మంది (సర్వీసు ఓటర్లు కాకుండా) ఓటర్లు ఉండగా తాజాగా విడుదల చేసిన జాబితాలో 12,73,591 మంది ఉన్నారు. ఐదేళ్లలో జిల్లా పరిధిలో 24,626 మంది ఓటర్లు పెరిగారు. అత్యధికంగా పాయకరావుపేట నియోజకవర్గంలో 7,223 మంది ఓటర్లు, అత్యల్పంగా మాడుగులలో 1,432 మంది ఓటర్లు పెరిగారు. నర్సీపట్నం నియోజకవర్గంలో 1,402 ఓటర్లు తగ్గడం ఈ సందర్భంగా గమనార్హం. 2019 ఎన్నికల్లో అనకాపల్లి నియోజకవర్గంలో 2,04,699 మంది ఓట్లు వుండగా, తాజా జాబితాలో 2,10,897 మంది ఉన్నారు. 6,198 మంది ఓటర్లు పెరిగారు. చోడవరం నియోజకవర్గంలో అప్పట్లో 2,10,313 మంది ఓటర్లు వుండగా, తాజా జాబితాలో 2,15,017 మంది ఓటర్లు ఉన్నారు. 4,704 మంది ఓటర్లు పెరిగారు. మాడుగులలో గత ఎన్నికల్లో 1,85,791 మంది ఓటర్లు ఉండగా, తాజా జాబితాలో 1,87,223 మంది ఉన్నారు. 1,432 మంది ఓటర్లు పెరిగారు. ఎలమంచిలిలో గత ఎన్నికల్లో 1,97,602 మంది ఉండగా ప్రస్తుత జాబితాలో 2,04,073 ఉన్నారు. 6,471 మంది ఓటర్లు పెరిగారు. నర్సీపట్నం నియోజకవర్గంలో గతంలో 2,10,275 మంది ఓటర్లు ఉంటే తాజా జాబితాలో 2,08,873 మంది ఓటర్లు ఉన్నారు. 1,402 మంది ఓటర్లు తగ్గారు. పాయకరావుపేటలో గత ఎన్నికల్లో 2,40,285 మంది ఓటర్లు ఉండగా తాజా జాబితాలో 2,47,508 మంది ఉన్నారు. 7,223 ఓటర్లు పెరిగారు.

అన్ని అర్జీల పరిశీలన తరువాతే తుది జాబితా

ముసాయిదా ఓటర్ల జాబితాపై అందిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే తుది ఓటర్ల జాబితా రూపొందించామని జిల్లా ఎలక్టోరల్ అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తెలిపారు. మార్పులు, చేర్పుల విషయంలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, వాస్తవాల ఆధారంగానే జాబితాలను రూపొందించామన్నారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు వ్యక్తం చేసిన అభ్యంతరాలకు తగిన సమాధానాలు ఇచ్చామని, సందేహాలను నివృత్తి చేశామని చెప్పారు. ఓటర్ల జాబితాల్లో మార్పులు చేర్పులకు ఇంకా అవకాశం ఉందని ఆయన వెల్లడించారు. అయితే ఏకమొత్తంలో మార్పులకు అవకాశం లేదనిఇ స్పష్టం చేశారు. ఓటరు నమోదు, తొలగింపులకు సంబంధించి నిర్ణీత ఫారాలను అందజేయాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడి, అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడానికి తుది గడువుకు 10 రోజుల ముందు వరకు మార్పులు, చేర్పులు, తొలగింపులకు అవకాశం ఉందని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ సందేహాలను నేరుగా తనుగానీ లేదా ఈఆర్‌ఓలకుగానీ తెలియజేవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

- రవి పట్టన్‌శెట్టి, జిల్లా ఎలక్టోరల్ అధికారి

అంగన్‌వాడీల తొలగింపు!

ప్రభుత్వం దుందుడుకు చర్య

- జిల్లాలో 2,656 మంది తొలగింపునకు అధికారులు చర్యలు
- 1,276 మంది వర్కర్లు, 1,224 మంది సహాయకులు, 156 మంది మినీ అంగన్‌వాడీ వర్కర్లకు టెర్మినేషన్ ఉత్తర్వులు సిద్ధం
- ఇప్పటికే 90 మందికి వాట్సాప్ ద్వారా సమాచారం
- మిగిలిన వారికి నేడు పోస్టు ద్వారా ఉత్తర్వులు బట్వాడా
- ప్రభుత్వ హెచ్చరికలతో 863 మంది విధుల్లో చేరిక



అనకాపల్లిలో సీఐటీయూ కార్యాలయం నుంచి నెహ్రూచౌక్‌కు ర్యాలీగా వస్తున్న అంగన్‌వాడీలు

అనకాపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): డిమాండ్ల సాధన కోసం ఆరు వారాల నుంచి నిరవధికంగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ప్రభుత్వం క్రమశిక్షణ చర్యలకు దిగింది. గడువులోగా విధుల్లో చేరలేదంటూ జిల్లాలో దాదాపు రెండున్నర వేల మంది వర్కర్లు, ఆయాలపై వేటు వేయాలని నిర్ణయించుకుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు తొలగింపు ఉత్తర్వులను సిద్ధం చేశారు.

తమ సమస్యలు పరిష్కరించాలని, గత ఎన్నికల ముందు అప్పటి ప్రతిపక్ష నేత జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ రాష్ట్ర అసోసియేషన్ పిలుపుమేరకు జిల్లాలోని అంగన్‌వాడీలు గత నెల 12వ తేదీ నుంచి సమ్మె చేస్తున్న విషయం తెలిసింది. మండల కేంద్రాల్లో శిబిరాలను ఏర్పాటు చేసి, విభిన్న రీతుల్లో ప్రభుత్వానికి తమ నిరసన తెలియజేస్తున్నారు. ఈ మధ్య కాలంలో ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలం కావడంతో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేశారు. దీంతో ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించింది. అంతేకాక షోకాజ్ నోటీసులను సైతం జారీ చేసింది. వీటికి అంగన్‌వాడీలు ఇచ్చిన సమాధానం సరిగా లేదంటూ ఈ నెల 22వ తేదీలోగా విధుల్లో చేరాలని, లేకుండా ఉద్యోగాల నుంచి తొలగిస్తామని హెచ్చరించింది. అయినప్పటికీ అంగన్‌వాడీలు వెనక్కు తగ్గలేదు. సోమవారం 'చలో విజయవాడ'కు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి జిల్లా నుంచి బయలుదేరిన అంగన్‌వాడీలను ఎక్కడికక్కడ నిలువరించి, తిరిగి ఆయా పోలీసు స్టేషన్లకు తరలించారు. సోమవారం ఉదయం విడిచిపెట్టారు. అంతే కాకుండా సోమవారం ఉదయం 9.30 గంటల్లో విధుల్లో చేరని వారిని తొలగించాలని జిల్లా అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఐసీడీఎస్ పీడీ అనంతలక్ష్మిలు అంగన్‌వాడీ కార్యకర్తలను, ఆయాలను తొలగించేందుకు టెర్మినేషన్ ఆర్డర్లను సిద్ధం చేశారు. జిల్లాలో తొమ్మిది ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,697 మంది అంగన్‌వాడీ వర్కర్లు, 1,650 మంది సహాయకులు, 172 మంది మినీఅంగన్‌వాడీ వర్కర్లు పని చేస్తున్నారు. వీరిలో 421 మంది అంగన్‌వాడీ వర్కర్లు, 426 మంది సహాయకులు, 16 మంది మినీ అంగన్‌వాడీ వర్కర్లు సోమవారం విధుల్లో చేరారు. మిగిలిన 1,276 మంది వర్కర్లు, 1,224 మంది సహాయకులు, 156 మంది మినీ అంగన్‌వాడీ వర్కర్లు.. మొత్తం 2,656 మంది తొలగింపునకు ఉత్తర్వులు సిద్ధం చేసినట్టు ఐసీడీఎస్ పీడీ అనంతలక్ష్మి తెలిపారు. ఇప్పటికే 90 మందికి తొలగింపు ఉత్తర్వులను వాట్సాప్ ద్వారా పంపామన్నారు. మిగిలిన వారికి తొలగింపు ఉత్తర్వులను మంగళవారం పోస్టు ద్వారా పంపనున్నట్టు ఆమె వెల్లడించారు.

ప్రభుత్వ తీరుపై అంగన్‌వాడీలు ఆగ్రహం

- ర్యాలీలు, మానవహారాలు, రాస్తారోకోలతో నిరసన

(ఆంధ్రజ్యోతి-న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్ర ప్రభుత్వం తమపట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని ఆరోపిస్తూ అంగన్‌వాడీలు సోమవారం జిల్లా అంతటా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ర్యాలీలు, మానవహారాలు, రాస్తారోకోలు నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ప్రజల నుంచి సేకరించిన కోటి సంతకాల పత్రాలను సీఎంకు అందజేయడానికి విజయవాడ ... మిగతా 8వ పేజీలో

ఫ్లాష్.. ఫ్లాష్...

అంగన్‌వాడీల సమ్మె విరమణ : మంత్రి బొత్స

అంగన్‌వాడీలు సమ్మె విరమించి మంగళవారం నుంచి విధులకు హాజరవుతారని మంత్రి బొత్స సత్యనారాయణ సోమవారం అర్ధరాత్రి 12 గంటల తరువాత ప్రకటించారు. అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ సంఘం నేతలతో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలం అయినట్టు ఆయన పేర్కొన్నారు.

పశువులకు అరకొర వైద్యం

నాతవరం ఆస్పత్రిలో ఏడాది నుంచి డాక్టర్, అటెండరు పోస్టులు ఖాళీ

- పట్టించుకోని అధికారులు
- ఆరు నెలల క్రితం కొత్త భవనం ప్రారంభం
- ఇంతవరకు వినియోగంలోకి రాని వైనం



శిథిల భవనంలో కొనసాగుతున్న పశువైద్యకేంద్రం

నాతవరం, జనవరి 22: స్థానిక పశువైద్యకేంద్రంలో ఏడాది నుంచి వెటర్నరీ డాక్టర్, అటెండర్ లేకపోవడంతో పశువులకు సకాలంలో వైద్యం అందడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెటర్నరీ డాక్టర్, అటెండర్‌లను ప్రభుత్వం ఏడాది క్రితం బదిలీ చేసింది. అప్పటి నుంచి గోపాలమిత్రే పెద్ద దిక్కుగా మారారు. ఎట్టకేలకు రెండు నెలల క్రితం గునుపూడి పశువైద్య కేంద్ర డాక్టరు మోక్షారెడ్డిని నాతవరం పశువైద్యకేంద్రానికి డిప్యూటేషన్ వేశారు ఈమె మంగళ, బుధ, గురువారాల్లో మాత్రమే ఇక్కడకు వస్తున్నారు. పూర్తిస్థాయి డాక్టర్, అటెండర్‌ను నియమించాలని ఏడాది నుంచి కోరుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుండగా నాతవరం పశువైద్య కేంద్ర భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో అధికారులు రూ.32 లక్షలతో నూతన భవనాన్ని నిర్మించారు. గత ఏడాది జూన్ 12వ తేదీన మంత్రులు ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఇది జరిగి ఆరు నెలలు దాటినప్పటికీ పశువైద్య శాలలను కొత్త భవనంలోకి మార్చలేదు. దీనిపై ఇన్‌చార్జి వెటర్నరీ డాక్టర్ మోక్షారెడ్డిని వివరణ కోరగా.. నూతన భవనం ముందు చిన్న గెడ్డ ఉందని, ఇక్కడ వంతెన నిర్మిస్తే చేస్తే తప్ప పశువులు లోపలికి వచ్చే అవకాశం లేదన్నారు.



వినియోగంలోకి రాని పశువైద్య కేంద్రం నూతన భవనం

విశాఖలో షర్మిల

- రాహుల్ పాదయాత్రపై దాడిని ఖండిస్తూ గాంధీ విగ్రహం వద్ద నిరసన

రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్రపై అసోంలో బీజేపీ నాయకులు దాడికి పాల్పడ్డారంటూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సోమవారం రాత్రి విశాఖలో నిరసన చేపట్టారు. పీసీసీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారి నగరానికి వచ్చిన ఆమె ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయం ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. తొలుత గాంధీ విగ్రహానికి పూల దండ వేసి నివాళులర్పించిన అనంతరం ఆమె...పార్టీ నాయకులతో కలిసి నిరసన చేపట్టారు.

(-వార్త మెయిన్ ఎడిషన్‌లో)



గాంధీజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న షర్మిల

మార్మోగిన జై శ్రీరామ్

- అయోధ్యలో బాల రాముడు విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా జిల్లాలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు
- అంగరంగ వైభవంగా శ్రీరాముని శోభయాత్ర
- పిండివంటలు, ఫలాలు, సారెతో యాత్రలో పాల్గొన్న మహిళలు
- రామాలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలు
- సీతారాముల విగ్రహాలతో ఊరేగింపులు

(ఆంధ్రజ్యోతి- న్యూస్ నెట్‌వర్క్)

అయోధ్యలో బాల రాముడు విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం జిల్లాలో అన్ని ప్రాంతాలు 'జై శ్రీరామ్' నినాదాలతో మారుమోగాయి. విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ), రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్ఎస్ఎస్), సమసరతా సేవా ఫౌండేషన్, భజన బృందాలు, ఇతర హైందవ సంస్థల ఆధ్వర్యంలో వాడవాడలా శ్రీరామ శోభా యాత్రను అత్యంత వైభవంగా నిర్వహించారు. 'జై శ్రీరామ్' అని ముద్రించి వున్న కాషాయ రంగు కండువాలు ధరించి జై శ్రీరామ్ అంటూ నినదించారు. రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొన్నిచోట్ల సీతారాముల కల్యాణోత్సవాలు కూడా జరిపించారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలను, చిత్రపటాలను ఊరేగించారు. భక్తులకు అయోధ్య నుంచి వచ్చిన అక్షతలను పంపిణీ చేశారు. అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ ముహూర్త సమయంలోనే రావికమతం మండలం తట్టబంద, రోలుగుంట మండలం కొవ్వూరులో నూతనంగా నిర్మించిన రామాలయాల్లో విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఇళ్లల్లో ఐదు దీపాలు వెలిగించి పూజలు చేశారు. అయోధ్యలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన పలు కార్యక్రమాలను టీవీ ఛానెళ్లలో ప్రత్యక్షప్రసారం ద్వారా తిలకించారు.



అనకాపల్లిలో నిర్వహించిన శ్రీరాముని శోభాయాత్రలో టీడీపీ నాయకులు పీలా గోవింద, దాడి రత్నాకర్, జనసేన నాయకుడు పరుచూరి భాస్కరరావు, తదితరులు



మాడుగులలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

అనకాపల్లి పట్టణంలో శారదా బ్రిడ్జి వద్ద ఆంజనేయస్వామి ఆలయం నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా సుంకరమెట్ట జంక్షన్ వరకు శ్రీరాముని శోభాయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించారు. హిందూ సంఘాల ప్రతినిధులు, రామ భక్తులతోపాటు తెలుగుదేశం, జనసేన, వైసీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఎలమంచిలి పట్టణంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో భక్తులు కాషాయ రంగులో జై శ్రీరామ్ అని అక్షరాలు ముంద్రించి వున్న జెండాలు పట్టుకుని ఉత్సాహంగా శోభాయాత్రలు నిర్వహించారు. సీతారాముల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెరువుపల్లిలో సీతారాములను పల్లకీలో వుంచి, మహిళలు బెల్లం దిమ్మలతో ఊరేగించారు. చోడవరం మండలంలోని వివిధ గ్రామాల్లో శోభాయాత్రలు, రామాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, నిర్వహించారు. మహిళలు పిండివంటల సారెతో శోభాయాత్రలో పాల్గొన్నారు. పట్టణంలోని ఏడమ్స్ స్కూల్ విద్యార్థులు 'జై శ్రీరామ్' ఆకారంలో కూర్చుని విన్యాసాలు నిర్వహించారు.

గ్రామ పంచాయతీలకు విద్యుత్ బిల్లుల భారం

పాయకరావుపేట మండలంలో రూ.2.81 కోట్ల కరెంటు బకాయిలు

- నోటీసులు జారీ చేస్తున్న ఈపీడీసీఎల్ అధికారులు
- నిధులు లేవంటూ చేతులెత్తేస్తున్న సర్పంచులు, కార్యదర్శులు



పాయకరావుపేట పంచాయతీ కార్యాలయం

పాయకరావుపేట, జనవరి 22 :మండలంలోని గ్రామ పంచాయతీల్లో విద్యుత్ బకాయిలు పేరుకుపోయాయి. బిల్లులు చెల్లించాలని ఈపీడీసీఎల్ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. గతంలో ఆర్థిక సంఘం విడుదల చేసిన నిధులను కరెంటు బిల్లుల చెల్లింపు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం తీసేసుకుందని, బకాయిలు చెల్లించడానికి పంచాయతీల్లో నిధులు లేవని సర్పంచులు చేతులెత్తేస్తున్నారు. మండలంలో 24 గ్రామ పంచాయతీల్లో వీధి లైట్లు, తాగునీటి పథకాల మోటార్ల విద్యుత్ వినియోగానికి సంబంధించి గత ఏడాది జనవరి నుంచి ఈ ఏడాది జనవరి వరకు సుమారు రూ.2.81 కోట్లు విద్యుత్ బకాయిలు వున్నాయి. ఈపీడీసీఎల్ అధికారులు డిమాండ్ నోటీసులను ఎంపీడీఓతోపాటు ఆయా పంచాయతీల కార్యదర్శులకు అందజేస్తూ త్వరితగతిన చెల్లించాలని కోరుతున్నారు. మండల కేంద్రమైన పాయకరావుపేట పంచాయతీకి అత్యధికంగా రూ.83.43 లక్షలు విద్యుత్ బకాయిలు వున్నాయి. గోపాలపట్నం పంచాయతీలో 27.42 లక్షలు, శ్రీరాంపురం పంచాయతీలో రూ.19.44 లక్షలు.. మిగిలిన పంచాయతీల్లో కూడా రూ.లక్షల్లోనే బకాయిలు వున్నాయి. అతి తక్కువగా పాల్మన్‌పేట పంచాయతీ రూ.34,293 బకాయి ఉంది. ఇదిలావుండగా గతంలో కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసింది. వీటిని పంచాయతీలు డ్రా చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆయా బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసింది. తరువాత విద్యుత్ బిల్లుల బకాయిల పేరుతో పంచాయతీల ఖాతాల నుంచి నిధులు మళ్లించింది. దీంతో నిర్వహణ పనులకు నిధుల్లేక సర్పంచులు, కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇదిలావుండగా మళ్లీ రూ.లక్షల్లో కరెంటు బిల్లులు బకాయిలు వుండడం, ఈపీడీసీఎల్ అధికారులు నోటీసులు జారీ చేస్తుండడంతో త్వరలో కేంద్రం విడుదల చేసే ఆర్థిక సంఘం నిధులకు రాష్ట్ర ప్రభుత్వం టెండర్ పెట్టిందని సర్పంచులు ఆందోళన చెందుతున్నారు.

కదం తొక్కిన అంగన్‌వాడీలు

- అనకాపల్లిలో ర్యాలీ, నెహ్రూచౌక్‌లో మానవహారం, రాస్తారోకో
- ప్రభుత్వ తీరుపై మండిపడిన సీపీఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

అనకాపల్లి టౌన్, జనవరి 22: రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధాన్ని నిరసిస్తూ అంగన్‌వాడీలు సోమవారం అనకాపల్లిలో కదం తొక్కారు. వివేకానందనగర్‌లోని సీఐటీయూ కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా నెహ్రూచౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఇక్కడ మానవహారంగా ఏర్పడి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ, 42 రోజుల నుంచి సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలు, ప్రజల నుంచి సేకరించిన కోటి సంతకాల వినతిపత్రాలను ముఖ్యమంత్రి జగన్‌కు నివేదించడానికి శాంతియుతంగా విజయవాడ వెళుతున్నారని, కానీ ప్రభుత్వం పోలీసులతో వారిని నిర్బంధించి భయభ్రాంతాలకు గురి చేయడమేకాకుండా అరెస్టు చేయించడం దారుణమని అన్నారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం విషయంలో వైసీపీ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తున్నదన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు మాట్లాడుతూ, అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 24వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పక్షాలతో కలిసి ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, ఐద్వా జిల్లా కార్యదర్శి డీడీ వరలక్ష్మి, కర్రి అప్పారావు, బి.ఉమామహేశ్వరరావు, గండి నాయనబాబు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు భవాని, ఆదిలక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.


అనకాపల్లి నెహ్రూచౌక్‌లో మానవహారంగా ఏర్పడిన అంగన్‌వాడీలు


చోడవరంలో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీస్ స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులు

అంగన్‌వాడీల ఆందోళన ఉధృతం

- ప్రభుత్వ తీరుకు నిరసనగా ప్రధాన రహదారిపై బైఠాయింపు

చోడవరం, జనవరి 22: తమ సమస్యలు పరిష్కరించకుండా విధులకు హాజరుకాకుంటే తొలగిస్తామని రాష్ట్ర ప్రభుత్వం బెదిరింపులకు దిగడాన్ని నిరసిస్తూ అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం పట్టణంలోని ప్రధాన రహదారిపై సోమవారం బైఠాయించి ఆందోళన చేశారు.

సీఐటీయూ నాయకురాలు గూనూరు వరలక్ష్మి ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. నిరంకుశ ముఖ్యమంత్రి జగన్ డౌన్ డౌన్ అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళనతో రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. సీఐ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్ఐ అప్పలనాయుడు, సిబ్బంది ఆందోళన చేస్తున్న కొందరు అంగన్‌వాడీ కార్యకర్తలను బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో ఇతర అంగన్‌వాడీ కార్యకర్తలు సైతం పోలీస్ స్టేషన్‌కు చేరుకుని సాయంత్రం వరకూ ఆందోళన చేశారు.

నేతల నిర్బంధం

విజయవాడలో అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళన నేపథ్యంలో ఆదివారం రాత్రి నుంచి సీఐటీయూ నేతలు, అంగన్‌వాడీ సంఘాల నాయకులను పోలీసులు ముందస్తుగా నిర్బంధించారు. సోమవారం ఉదయం అంగన్‌వాడీ కార్యకర్తల దీక్షా శిబిరం వద్ద కూడా పోలీసులు మోహరించి వారు ఎటూ వెళ్లకుండా బందోబస్తు నిర్వహించారు.

క్రైం... crime news

నేల బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కశింకోట, జనవరి 22 : కశింకోటలోని ఒక ప్రైవేటు లేఅవుట్‌లో ఉన్న నేలబావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం తేలిందని సీఐ కె.వి సేద్‌బాబు తెలిపారు. మృతుడు ఎరుపురంగు షర్టు, స్కట్ డ్రాయర్ ధరించి ఉన్నాడని చెప్పారు. కశింకోట-3 వీఆర్వో గొర్లి ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బంగారం దుకాణాల్లో చోరీకి యత్నం

ఎలమంచిలి, జనవరి 22: పట్టణంలోని భవనం వీధిలో రెండు బంగారు దుకాణాల్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పట్టణ ఎస్ఐ పాపినాయుడు వెల్లడించిన సమాచారం ప్రకారం.. భవనం వీధిలో వున్న రెండు బంగారు దుకాణాల షట్టర్లు కొంతమేర ఎత్తి వుండడాన్ని సోమవారం ఉదయం ఆయా యజమానులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ గఫూర్‌తోపాటు క్లూస్ టీమ్ నిపుణులు, క్రైమ్ అధికారులు వచ్చి వివరాలు సేకరించారు. దుకాణాల్లో నగదు, బంగారం చోరీకి గురికాలేదని నిర్ధారించారు. యజమాని కుషాల్ వికాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.


చోరీ యత్నం జరిగిన బంగారం నగల దుకాణాన్ని పరిశీలిస్తున్న సీఐ గఫూర్

17 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, జనవరి 22: మండలంలో సోమవారం వేర్వేరుచోట్ల పోలీసులు దాడులు చేసి 17 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి సీఐ బాల సూర్యారావు అందించిన వివరాలిలా ఉన్నాయి. తానాం గ్రామంలో పైలా అప్పారావు అనే వ్యక్తి పాన్‌షాపు నిర్వహిస్తూ మద్యం అమ్మకాలు చేపడుతున్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు దాడులు చేసి తొమ్మిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. షాపు యజమానిని అదుపులోకి తీసుకున్నారు. కలపాక పంచాయతీ పరిధి స్వయంభూవరం గ్రామానికి చెందిన బొండా గోవింద అనే వ్యక్తి పరవాడ సినిమాహాల్ జంక్షన్ వద్ద వున్న ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి ఎనిమిది మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి ఇంటి వద్ద విక్రయించేందుకు తీసుకువెళ్తున్నాడు. పోలీసులు అతన్ని అడ్డుకుని సోదా చేయగా మద్యం సీసాలు లభించాయి. ఇతనిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు

అచ్యుతాపురం రూరల్, జనవరి 22 : మండలంలోని వెదురువాడ సమీపంలో ఆర్టీసీ బస్సు, బైక్‌ను ఢీకొన్న సంఘటనలో కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. విశాఖలో సిటీలో పోలీసు కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న యర్రంశెట్టి రాము సోమవారం సాయంత్రం ఎలమంచిలి వైపు నుంచి అచ్యుతాపురం వైపు బైక్ వస్తున్నాడు. వెదురువాడ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు బలంగా ఢీకొంది. దీంతో రాము తలకు, ముఖానికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు.

సెల్ టవర్‌లో మంటలు

- దగ్ధమైన బ్యాటరీలు, మంటలను అదుపులోకి తెచ్చిన ఫైర్ సిబ్బంది

పాయకరావుపేట, జనవరి 22 : సెల్ టవర్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు ఎగిసిపడడంతో సమీపంలోని నివాసితులు భయాందోళనకు గురయ్యారు. సూర్యమహల్ సెంటర్‌కి సమీపంలో ఉన్న పండరీపురం వీధిలో ఓ ప్రైవేటు టెలికం సంస్థ సెల్ టవర్ ఏర్పాటుచేసింది. సోమవారం సాయంత్రం సెల్ టవర్‌లో విద్యుత్ షార్టు సర్క్యూట్ కారణంగా మంటలు ఎగిశాయి. సెల్ టవర్ కిందనున్న బ్యాటరీల నుంచి మంటల వస్తుండడంతో చుట్టుపక్కల ఇళ్లల్లో వుంటున్న వారు భయంతో పరుగులు తీశారు. సమాచారం అందుకున్న పాయకరావుపేట పోలీసులు, తుని ఫైర్ సిబ్బంది వచ్చి సుమారు గంటన్నర పాటు శ్రమించి మంటలను అదుపు చేశారు.


సెల్ టవర్ నుంచి ఎగిసిపడుతున్న మంటలు

ఆలిండియా పోలీసు కమాండో పోటీలు ప్రారంభం


బెలూన్లు ఎగురవేసి పోటీలను ప్రారంభిస్తున్న గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీపీ రాజీవ్‌కుమార్ మీనా, విశాఖ సీపీ రవిశంకర్ అయ్యన్నార్ తదితరులు

- జాతీయ స్థాయిలో 23 జట్లు ప్రాతినిధ్యం
- పాల్గొన్న 800 మంది క్రీడాకారులు

విశాఖపట్నం, జనవరి 22 : దేశంలో ఉత్తమమైన కమాండోలు పాల్గొంటున్న ఈ పోటీలు ప్రపంచంలోనే అత్యుత్తమమైనవని నగర పోలీసు కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్ అన్నారు. సోమవారం ఆయన నగర శివారులోని కాపులుప్పాడ గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రంలో 14వ ఆల్ ఇండియా పోలీసు కమాండో పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తన పోలీసు వృత్తిని గ్రేహౌండ్స్ విభాగంలో అసాల్ట్ కమాండర్‌గా ప్రారంభించానన్నారు. పోటీల్లో రాష్ట్రస్థాయి జట్లతో పాటు పారా మిలటరీ దళాలు నుంచి కమాండోస్ వరకూ పాల్గొంటున్నట్టు చెప్పారు. గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీపీ రాజీవ్‌కుమార్ మీనా మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత ఈ పోటీలను ఏపీ పోలీసు శాఖ తరపున గ్రేహౌండ్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించడం ఇదే ప్రథమమన్నారు. ఈనెల 30 వరకూ పోటీలు జరుగుతాయని, ముగింపు కార్యక్రమానికి డీజీపీ కసిరెడ్డి వెంకట రాజేంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నట్టు తెలిపారు. పోటీల్లో జాతీయ స్థాయిలో 23 జట్లు ప్రాతినిధ్యం వహిస్తున్నాయని, వీటిలో 16 జట్లు రాష్ట్రస్థాయి కాగా, 7 ఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, పీఆర్పీఎఫ్, సీఐఎస్ఎఫ్, ఐటీబీటీ, ఎస్ఎప్పీ, అస్సాం రైఫిల్స్ జట్లు ఉన్నాయని వివరించారు. సుమారు 800 మంది కమాండోలు పాల్గొన్నారన్నారు. పోటీలు నేవిగేషన్, స్కిల్ టెస్ట్, ప్లానింగ్ అండ్ ప్రెజెంటేషన్, ఫిజికల్, ఫైరింగ్ విభాగాల్లో జరుగుతాయని తెలిపారు. కాగా తొలుత వివిధ రాష్ట్రాల కమాండోలు, పారా మిలిటరీ దళాల కమాండోలు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. పోటీలకు నిర్మించిన రెడ్ పోర్టువాల్‌ను ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో ఇన్‌కంటాక్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనరు రాజీవ్ కుమార్ సింగ్, పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ అతుల్ సింగ్, విశాఖ రేంజ్ ఐజీ హరికృష్ణ, గ్రేహౌండ్స్ డీఐజీ కొయ్య ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	110.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	563
విజయనగరం	567
శ్రీకాకుళం	567

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

- స్పందనలో అధికారులకు కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి ఆదేశం

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 22: స్పందన అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆయన మాట్లాడుతూ, వివిధ సమస్యలపై ప్రజలు అందించే వినతి పత్రాలు, ఫిర్యాదులను నిశితంగా పరిశీలించి త్వరితగతిన క్లియర్ చేయాలని చెప్పారు. స్పందనలో ప్రధానంగా భూసమస్యలు, రేషన్‌కార్డుల మంజూరుకు సంబంధించి అర్జీలు అధికంగా వస్తున్నాయని, సంబంధిత అధికారులు వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ నెల 25వ తేదీన జాతీయ ఓటరు దినోత్సవాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. 26న నిర్వహించే గణతంత్ర దినోత్సవానికి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. కాగా స్పందన కార్యక్రమంలో వివిధ సమస్యలకు సంబంధించి 213 అర్జీలు అందాయి. వీటిని పరిష్కారం నిమిత్తం సంబంధిత శాఖలకు బదలాయించారు.


అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

జిల్లా పోలీస్ కార్యాలయంలో..

అనకాపల్లిరూరల్, జనవరి 22: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్పీ కేవీ మురళీకృష్ణ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారితో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అర్జీలను సంబంధిత అధికారులకు బదలాయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, స్పందన అర్జీలను త్వరగా పరిష్కరించి, ఫిర్యాదులపై తీసుకున్న చర్యల గురించి నిర్ణీత గడువులోగా నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. మొత్తం 26 అర్జీలు అందగా.. వీటిలో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు వంటివి అధికంగా వున్నాయి. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సత్యనారాయణ, ఎస్ఐ సావిత్రి పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి మురళీధరన్ సబ్బవరం రాక రేపు

సబ్బవరం, జనవరి 22: కేంద్ర విదేశాంగ, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వి.మురళీధరన్ ఈ నెల 24వ తేదీన సబ్బవరం రానున్నట్టు ఎంపీడీవో రమేశ్‌నాయుడు తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో పాల్గొని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 18 రకాల పథకాల గురించి ప్రజలకు వివరిస్తారని చెప్పారు.

వచ్చే నెలలో కొత్త రైల్వే జోన్‌కు భూమి పూజ: ఎంపీ సత్యవతి

అనకాపల్లి టౌన్, జనవరి 22: విశాఖ రైల్వే జోన్ పనులకు ఫిబ్రవరి మొదటి వారంలో భూమి పూజ జరగనుందని అనకాపల్లి ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి చెప్పారు. సోమవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, విశాఖ కేంద్రంగా ఏర్పాటయ్యే దక్షిణ కోస్తా (సౌత్ కోస్ట్) రైల్వేజోన్‌కు కేంద్ర ప్రభుత్వం రూ.170 కోట్లు ఖర్చు చేయనున్నదని చెప్పారు. శంకుస్థాపన పనుల కోసం రూ.10 కోట్లు విడుదల చేసిందని ఆమె వెల్లడించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయొద్దంటూ ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారని, ఎంపీలు కూడా పార్లమెంట్‌లో ప్రధానిని కలిసి వినతి పత్రం ఇచ్చామని ఆమె చెప్పారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ

అనకాపల్లిలో ఎస్పీ పర్యటన

అనకాపల్లి టౌన్, జనవరి 22: జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదివారం రాత్రి అనకాపల్లిలో పర్యటించారు. అంగన్‌వాడీలు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పాల్గొనడానికి విజయవాడ వెళుతున్న విషయాన్ని తెలుసుకున్న ఆయన అధికారులను అప్రమత్తం చేయడంతో పాటు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షించారు. అంగన్‌వాడీలు ఎవరూ విజయవాడ వెళ్లకుండా కట్టడి చేయడాలని కిందిస్థాయి పోలీస్ అధికారులను ఆయన ఆదేశించారు.


ఆదివారం రాత్రి బైపాస్ జంక్షన్‌లో పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

మూడు నెలల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయం

- మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

నాతవరం, జనవరి 22: మూడు నెలల్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రానున్నదని, నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కానున్నారని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. సోమవారం నాతవరం మండలం ఏపీపురం పంచాయతీ ఉప్పరగూడెం గ్రామంలో ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ వైసీపీ నాలుగున్నర ఏళ్ల పాలనలో అన్నివర్గాల ప్రజలు విసుగుచెంది ఉన్నారన్నారు. మేధావులు, ప్రజలు మౌనం వహిస్తే దుర్మార్గులు రాజ్యమేలుతారని పెద్దలు చెబుతుండేవారని, ఇప్పుడు అదే నిజమని తెలిసిందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఏవో సాకులు చూపించి నాలుగు లక్షల మంది పింఛన్లు రద్దు చేశారని పేర్కొన్నారు. ఎనిమిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచి సామాన్యుల నడ్డి విరిచారని ఆయన విమర్శించారు. ఏపీపురం ఎంపీటీసీ సభ్యుడు లోవరాజు మాట్లాడుతూ పంచాయతీ నిధులను సీఎం జగన్ దారి మళ్లించడంతో సర్పంచులు ఉత్సవ విగ్రహాలుగా మిగిలారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు కరక సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, నర్సీపట్నం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లాలం అచ్చిరాజు, మాజీ ఎంపీపీ ఎస్.విజయ్‌కుమార్, తాండవ ప్రాజెక్టు మాజీ చైర్మన్ కొండబాబు, సర్పంచ్ పైల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.


ఉప్పరగూడెంలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో అనకాపల్లి క్రీడాకారులకు పతకాలు

అనకాపల్లి టౌన్, జనవరి 22: గుంటూరు జిల్లా తెనాలిలో మూడు రోజుల పాటు జరిగిన సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ వివిధ విభాగాల పోటీల్లో అనకాపల్లికి చెందిన క్రీడాకారులు పలు పతకాలు సాధించారు. పురుషుల 83 కిలోల జూనియర్ విభాగంలో ఆళ్ల సతీశ్ కాంస్య పతకం, 93 కిలోల సీనియర్స్ విభాగంలో కె.నరేంద్ర కాంస్య పతకం, బాలికల 76 కిలోల సీనియర్స్ విభాగంలో కె.ప్రవల్లిక రజత పతకం పొందారు. వీరిని పవర్ లిఫ్టింగ్ జిల్లా అసోసియేషన్ ప్రధానకార్యదర్శి బి.బద్రినాథ్, చైర్మన్ కాండ్రేగుల శ్రీరామ్, గౌరవాధ్యక్షుడు కె.అప్పలనాయుడు, అధ్యక్షుడు నీలా అభినందించారు.



పతకాల విజేతలతో పవర్ లిఫ్టింగ్ జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు

శ్రీరామునికి 108 కిలోల లడ్డూ ప్రసాదం



ఊరేగింపుగా వెళుతున్న కాలనీవాసులు


కాలనీవాసులు తయారు చేసిన 108 కిలోల లడ్డూ ప్రసాదం

మాడుగుల రూరల్, జనవరి 22: అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని సోమవారం మండలంలోని పలు గ్రామాలు జైశ్రీరామ్ నామస్మరణతో మార్మోగాయి. మాడుగులలో హైస్కూల్, అర్బన్ కాలనీ వాసులు 108 కిలోల లడ్డూ ప్రసాదాన్ని తయారు చేయించి రిక్షాపై సీతారామ లక్ష్మణ సమేత ఫ్లెక్సీని పెట్టి లడ్డూ ప్రసాదాన్ని ఊరేగించి సీతారామాలయంలో సమర్పించారు. రామాలయాల వద్ద భక్తులు భజనలు చేశారు.

వానరం భక్తి

బుచ్చెయ్యపేట, జనవరి 22: అయోధ్య రామాలయంలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతున్న వేళ మండలం కొండపాలెంలోని ఓ ఇంటిపై ఎగురవేసిన శ్రీరామ జెండాను వానరం పట్టుకోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. సోమవారం ఓ వానరం ఆ ఇంటిపై ఎగురుతున్న జెండాను పట్టుకుని చాలా సేపు కూర్చొంది. దీనిని చూసి అందరూ జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు.


కొండపాలెంలో శ్రీరామ జెండాను పట్టుకున్న వానరం

కాండం నుంచి అరటి గెల

కృష్ణాదేవిపేట, జనవరి 22: గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట గ్రామంలో దిమిలి రమణ ఇంటి పెరట్లో ఒక అరటి చెట్టు కాండం నుంచి అరటి గెల వచ్చింది. దీంతో ఈ వింత చూసేందుకు స్థానికులు ఎగబడ్డారు. దానిని సెల్ కెమెరాల్లో బంధించారు. అరటి గెల కాండంలో రావడం ఈ ప్రాంతంలో ఇదే మొదటిసారి అని పలువురు తెలిపారు.


కాండం నుంచి వచ్చిన అరటి గెల

జీవీఎంసీలో భారీగా బదిలీలు?

- మూడేళ్లకుపైబడి ఉన్నవారికి స్థాన చలనం
- ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రభావం

విశాఖపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న పలువురు అధికారుల బదిలీకి రంగం సిద్ధమైంది. ఒకేచోట మూడేళ్లకుపైగా పనిచేస్తున్న వారిని ఇతర జిల్లాలకు బదిలీ చేయాలంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీచేసిన విషయం తెలిసిందే. జీవీఎంసీ జోన్-3 కమిషనర్ విజయలక్ష్మి, జోన్-5 కమిషనర్ ఆర్‌వీఎస్ కృష్ణ మినహా మిగిలిన ఆరుగురు జోనల్ కమిషనర్లు మూడేళ్లకు మించి జీవీఎంసీలో పనిచేస్తున్నారు. ఇప్పుడు వారంతా బదిలీ కావాల్సి ఉంటుంది. అలాగే టౌన్‌ప్లానింగ్ విభాగంలో సిటీ ప్లానర్‌గా పనిచేస్తున్న దొరతోపాటు ఇద్దరు డీసీపీలు ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది. అదేవిధంగా ఇంజనీరింగ్ విభాగంలో ఇద్దరు సూపరింటెంటెండెంట్ ఇంజనీర్లకు కూడా బదిలీ కావాల్సి ఉంటుంది. యూసీడీ విభాగంలో డీపీఓలుగా పనిచేస్తున్న ఇద్దరు అధికారులు కూడా మూడేళ్లకుపైగా పనిచేస్తుండడంతో వారికి కూడా బదిలీ తప్పదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. బదిలీలపై ఇప్పటికే కసరత్తు పూర్తయిందని, ఒకటి, రెండు రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

విద్యుత్ చార్జీలపై 29 నుంచి ఏపీఈఆర్‌సీ ప్రజాభిప్రాయ సేకరణ

విశాఖపట్నం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో అమలు చేయనున్న విద్యుత్ చార్జీలపై ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఈ నెల 29 నుంచి వర్చువల్ విధానంలో ప్రజాభిప్రాయ సేకరణ చేయనుందని ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ సోమవారం తెలిపారు. ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ వి.నాగార్జునరెడ్డి నేతృత్వంలో నాలుగు రోజులు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో ఈఆర్‌సీ సభ్యులు ఠాకూర్‌సింగ్, పీవీఆర్ రెడ్డి పాల్గొంటారు. విశాఖపట్నంలోని ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో వరుసగా నాలుగు రోజులు ప్రతిరోజు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు అభిప్రాయాలు తెలుసుకుంటారు. విద్యుత్ సంస్థలు సమర్పించిన వార్షిక ఆదాయం అవసరాల అంచనాలపై అభిప్రాయాలు స్వీకరిస్తారు. విద్యుత్ పంపిణీ సంస్థల అధికారులతో పాటు ట్రాన్స్‌కో, జెన్‌కో అధికారులు పాల్గొంటారు. అభిప్రాయాలు తెలియజేయాలనుకునేవారు ఆయా జిల్లాల్లోని సమీప విద్యుత్ ఆపరేషన్ సర్కిల్ కార్యాలయం లేదా డివిజన్ కార్యాలయానికి వెళ్లి ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సీఎండీ పృథ్వీతేజ్ సూచించారు. ప్రజలంతా వీక్షించేలా ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం చేస్తామన్నారు.

మూడు గ్రామాల రైతుల ఆందోళన

- ల్యాండ్ పూలింగ్ ఆర్‌సీ ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని డిమాండ్

సబ్బవరం, జనవరి 22 : మండలంలోని పైడివాడ, పైడివాడ అగ్రహారం, ఎరుకునాయుడుపాలెం గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ కింద సేకరించిన భూములకు సంబంధించి ప్రభుత్వం తమకు పరిహారంగా ఇవ్వాల్సిన రీ కానిస్టిట్యూట్ (ఆర్‌సీ) ప్లాట్లు తక్షణమే రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం అనకాపల్లి కలెక్టరేట్ ముందు మూడు గ్రామాల రైతులు ఆందోళన చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు అక్కిరెడ్డి దుర్గినాయుడు, బొబ్బరి కన్నారావు, గొంతిన పైడిరాజు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు కింద పేదలందరికీ ఇళ్ల పథకంలో పట్టణ పేదలకు ఇళ్ల స్థలాలు(సెంటు స్థలం) కోసం మూడు గ్రామాలకు చెందిన సుమారు 150 మంది రైతుల డీపట్టా, ఆక్రమణలో ఉన్న 320 ఎకరాలు సమీకరించిందన్నారు. ఆ సమయంలో గ్రామాల్లో పలు మార్లు అప్పటి రెవెన్యూ అధికారులు గ్రామ సభలు పెట్టి ఆక్రమణకు 450 గజాలు, డీ పట్టాకు 900 గజాలు రైతులకు పరిహారం కింద ఆర్‌సీ ప్లాట్లు ఇస్తామని చెప్పారన్నారు. ప్రతి రైతుకు సంబంధించిన ఆర్‌సీ ప్లాట్లు అన్ని విధాలుగా కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసి ఇస్తామని చెప్పారన్నారు. అయితే ఇది గడిచి నాలుగేళ్లు అవుతున్నా ఇప్పటి వరకూ ప్లాట్లు ఎటువంటి అభివృద్ధి చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు అక్కిరెడ్డి అప్పారావు, కోన సత్యనారాయణ, ఎం.అప్పలరాజు తదితరులతో పాటు వందమంది రైతులు పాల్గొన్నారు.


అనకాపల్లి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

అనకాపల్లి
నియోజకవర్గం

న్యాయవాదుల దీక్షకు కొణతాల సంఘీభావం



న్యాయవాదులతో మాట్లాడుతున్న కొణతాల

అనకాపల్లి టౌన్, జనవరి 22: భూ హక్కుల చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ కోర్టు వద్ద అనకాపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు చేస్తున్న రిలే దీక్షా శిబిరాన్ని మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ సోమవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయి, న్యాయవాదులు కుమార్, పిళ్లా హర శ్రీనివాసరావు, రెడ్డి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు : సీఐ

అనకాపల్లి టౌన్, జనవరి 22 : మోటార్ వాహన చట్టం నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ టి.శ్రీను హెచ్చరించారు. రహదారి భద్రతపై సోమవారం స్థానిక కశింకోట ఆటో స్టాండ్ వద్ద జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఆటో డ్రైవర్లు నిబంధనలు మేరకు వాహనాలను నడపాలని సూచించారు. ట్రాఫిక్ ఎస్ఐ ఎన్.సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ స్టేషన్‌ను సందర్శించిన ఆర్ఎఫ్ఓ

అనకాపల్లి టౌన్, జనవరి 22 : పట్టణంలోని అగ్నిమాపకశాఖ కార్యాలయాన్ని సోమవారం సాయంత్రం రీజనల్ ఫైర్ ఆఫీసర్ డి.నిరంజన్‌రెడ్డి సందర్శించారు. ప్రస్తుతమున్న అగ్నిమాపకశాఖ కార్యాలయ పైభాగంలో లారస్ సంస్థ సీఎస్ఆర్ నిధులతో చేపడుతున్న జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి కార్యాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. జిల్లా అగ్నిమాపక అధికారి ఆర్‌వీ రమణ, అనకాపల్లి అగ్నిమాపకశాఖ అధికారి నరసింగరావు, సిబ్బంది పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల హక్కు పత్రాలు పంపిణీ

అనకాపల్లి టౌన్, జనవరి 22 : జీవీఎంసీ 82వ వార్డు పరిధిలోని 14వ సచివాలయం వద్ద సోమవారం టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు హక్కు పత్రాలను, ఆరోగ్యశ్రీ కార్డులను కార్పొరేటర్ మందపాటి సునీత పంపిణీ చేశారు. వైసీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు జానకిరామరాజు, కార్యదర్శి గ్రేపూరి రాజు, డాక్టర్ బొడ్డేడ లక్ష్మీనరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణను అడ్డుకోవాలని వినతి

తుమ్మపాల, జనవరి 22 : మార్టూరు గ్రామస్థులకు చెందిన మాకవరం రెవెన్యూ పరిధి సర్వే నంబరు 175-3లో గల 4.29 సెంట్ల మెట్టుబంద భూమి ఆక్రమణను అధికార యంత్రాంగం అడ్డుకోవాలని మార్టూరు గ్రామస్థులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమంలో వినతిపత్రాన్ని అందజేశారు. కరణం చిలుకు, కరణం శ్రీనివాసరావు, వెంకట శేషు, వెంకటరమణ పాల్గొన్నారు.

శ్రీరామ రామ రామేతి..

» అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా అనకాపల్లిలో ఆధ్యాత్మిక వేడుక
» రామాలయాల్లో విశేష పూజలు » భక్తజనసందోహంతో సాగిన శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న వాగ్గేయ వరదాయిని సభ్యులు, భక్తజనులు



శోభాయాత్రలో సీతారామలక్ష్మణుల ఉత్సవ విగ్రహాలు



సబ్బవరం మండలం తవ్వవానిపాలెంలో శోభాయాత్ర

అనకాపల్లి టౌన్, జనవరి 22 : అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా జిల్లాలో సోమవారం కోలాహల వాతావరణం నెలకొంది. రామాలయాల్లో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. నేత్రపర్వంగా శోభాయాత్రలు సాగాయి. ప్రధానంగా అనకాపల్లి పట్టణమంతా జైశ్రీరామ్ నామస్మరణతో మార్మోగింది. సాయంత్రం శారదాబ్రిడ్జి వద్ద గల ఆలయం నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా శోభాయాత్ర సుంకరమెట్ట జంక్షన్ వరకు సాగింది. ఈ యాత్రలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, పార్టీ యువ నాయకులు దాడి రత్నాకర్, కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి, మాదంశెట్టి నీలబాబు, మళ్ల సురేంద్ర, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పరుచూరి భాస్కరరావు, వైసీపీ నాయకులు కొణతాల మురళీకృష్ణ, డాక్టర్ లక్ష్మీనరసింహం, బొడ్డేడ శివ, పలు ఆలయాల చైర్మన్లు, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు బంకుపల్లి సత్యనారాయణ, ప్రముఖ పండితులు రేజేటి రామాచార్యులు, అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని బృంద ప్రతినిధి తిమ్మాపాత్రుని చక్రవర్తి, బొలిశెట్టి శ్రీనివాసరావు, బొడ్డేడ మురళీ, నుదురుపాటి తాతాజీ, కుంచా చినబాబు, పీవీ రమణ, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ బీవీ సత్యవతి తదితరులు పాల్గొన్నారు. శోభాయాత్రలో శ్రీరాముని విగ్రహంత పాటు కోలాటాలు, వివిధ వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

కొత్తూరు : మేజర్ పంచాయతీ కొత్తూరులో శ్రీరామ శోభాయాత్ర సాగింది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరుచూరి భాస్కరరావు, టీడీపీ నాయకులు దాడి రత్నాకర్ లతో పాటు భక్తులు పాల్గొన్నారు.

తుమ్మపాల : తుమ్మపాలలో శ్రీరాముని శోభయాత్ర అంగరంగ వైభవంగా సాగింది. వేలాది మంది భక్తులతో ప్రధాన రహదారి శ్రీరామ నామ స్మరణతో మార్మోగింది. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, గ్రామ నాయకులు కొణతాల శ్రీనివాసరావు, కర్రి బాబి, నడిపల్లి గణేష్, ఆడారి గోవిందరావు, నడిపల్లి బోసుబాబు, పల్లెల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మండలంలోని గ్రామాల్లో గల రామాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. సబ్బవరం, తవ్వవానిపాలెం, నంగినారపాడు, గొల్లలపాలెం, అమృతపురం, బంగారమ్మ పాలెం తదితర గ్రామాల్లో వేకువజాము నుంచి విశేష పూజలు జరిపారు. బాలరాముని చిత్రపటాలను ఊరేగించారు. తవ్వవానిపాలెంలో సింహాచలం దేవస్థానం వేదపండితులు శాస్త్రోక్తంగా వేడుక జరిపించారు. పారిశ్రామి కవేత్త బోకం శ్రీనివాస్, సర్పంచ్ స్వామినాయుడు, ఇందలి వెంకటరమణ, ఎర్నిబాబు, మాజీ సర్పంచ్ అప్పలనాయుడు, అప్పలరాజు పాల్గొన్నారు.

జిల్లా ఓటర్లు 12,73,591

... 5వ పేజీ తరువాయి

వుంది. మాడుగుల మినహా మిగిలిన నియోజకవర్గాల్లో ఓటర్లురెండు లక్షలకు పైబడి వున్నారు.

అన్ని సెగ్మెంట్లలో మహిళలపై పైచేయి

జిల్లా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పురుషుల కన్నా మహిళా ఓటర్లదే పైచేయి. పురుషులు 6,20,048 మంది వుంగా, మహిళలు 6,53,505 మంది వున్నారు. మొత్తంగా పరిశీలిస్తే 33,457 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. అత్యధికంగా అనకాపల్లి సెగ్మెంట్‌లో పురుషులతో పోలిస్తే 7,404 మంది మహిళలు ఎక్కువ ఉన్నారు. అత్యల్పంగా పాయకరావుపేటలో 3,684 మంది వున్నారు. నర్సీపట్నంలో 6,244, చోడవరంలో 6,111, ఎలమంచిలిలో 5,384, మాడుగులలో 4,630 మంది మహిళా ఓటర్లు అధికంగా వున్నారు.

3,911 మంది సర్వీసు ఓటర్లు

త్రివిధ దళాలు, పారా మిలిటరీల్లో పనిచేస్తున్న వారిలో అనకాపల్లి జిల్లాకు చెందిన 3,911 మంది ఓటర్లుగా వున్నారు. అనకాపల్లి నియోజకవర్గంలో అత్యధికంగా 1,028 మంది వున్నారు. ఎలమంచిలిలో 994, చోడవరంలో 592, మాడుగులలో 554, పాయకరావుపేటలో 435, నర్సీపట్నంలో 308 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారు. సర్వీసు ఓటర్లలో పురుషులు 3,844 మంది, మహిళలు 67మంది మాత్రమే వున్నారు.

జిల్లాలో 1,529 పోలింగ్ కేంద్రాలు

త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నిక కోసం జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1,529 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. అత్యధికంగా పాయకరావుపేట నియోజకవర్గంలో 292 పోలింగ్ కేంద్రాలు వున్నాయి. నర్సీపట్నంలో 262 అనకాపల్లిలో 251, ఎలమంచిలిలో 246, చోడవరంలో 243, మాడుగులలో 235 పోలింగ్ కేంద్రాలు వున్నాయి.

అంగన్‌వాడీల తొలగింపు

... 5వ పేజీ తరువాయి

వెళుతున్న అంగన్‌వాడీలను భయభ్రాంతాలకు గురి చేసి అరెస్టు చేయడం దారుణమన్నారు. 42 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ తమ న్యాయమైన డిమాండ్లను, గతంలో పాలకులు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనకాపల్లిలో సీఐటీయూ కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా నెహ్రూచౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. నెహ్రూచౌక్‌లో మానవహారంగా ఏర్పడి రాస్తారోకో చేశారు. పరవాడలో మండల పరిషత్ జంక్షన్‌లో రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వ వేధింపు చర్యలను నిరసిస్తూ చోడవరంలో ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసనకు దిగారు. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సీఐ బి.శ్రీనివాసనరావు, ఎస్ఐ అప్పలనాయుడు, పోలీసు సిబ్బంది వచ్చి ఆందోళనకారులను బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బుచ్చెయ్యపేట, మాడుగుల మండలాల నుంచి విజయవాడ వెళుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదివారం రాత్రి నక్కపల్లి వద్ద హైవేపై పోలీసులు అడ్డగించి, అక్కడి నుంచి అర్ధరాత్రి తరువాత బుచ్చెయ్యపేట, మాడుగుల పోలీసు స్టేషన్లకు తరలించి నిర్బంధించారు. నాతవరం, గొలుగొండ మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు గొలుగొండలో రాస్తారోకో చేశారు. నర్సీపట్నంలో సీఐటీయూ నాయకులు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

పెందుర్తి
నియోజకవర్గం

పరవాడలో ఘనంగా గుండాలమ్మ తీర్థం



అమ్మవారి సన్నిధిలో స్థానిక నాయకులు

పరవాడ, జనవరి 22 : మండల కేంద్రం పరవాడలో రెడ్డివారి కుటుంబీకుల ఆరాధ్య దేవత గుండాలమ్మ తీర్థం సోమవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వేకువ జాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. జడ్పీటీసీ పైలా సన్యాసి రాజు, వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, నాయకులు చుక్క రామునాయుడు, రెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణాలకు విరాళాలు



విరాళాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ, జనవరి 22 : కలపాక పంచాయతీ పరిధిలో స్వయంభూవరం శివాలయ మండప నిర్మాణానికి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ లక్ష రూపాయల విరాళాన్ని సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొండా కనకారావు, వైసీపీ నాయకులు పైలా శ్రీనివాసరావు, చుక్క రామునాయుడు, కోన రామారావు, ఇందల రామారావు, జి.మోహనరావు, నరసింహరావు, సురేష్‌లతో పాటు ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సబ్బవరం : ఎర్రవానిపాలెంలో నిర్మాణంలో ఉన్న శ్రీకృష్ణ ఆలయానికి నియోజకవర్గం తెలుగు యువత కార్య నిర్వాహక కార్యదర్శి రోమాల చంద్రశేఖర్ రూ.1.4లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ కమిటీ సభ్యులు పిల్లల అప్పలనాయుడు, దుంగ ఈశ్వర రావు, కోన కృష్ణ, రోమాల వెంకటేశ్, శ్రీను, సింహాచలం సత్కరించారు.

అంగన్‌వాడీల రాస్తారోకో

పరవాడ, జనవరి 22 : అంగన్‌వాడీలపై ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండిస్తూ సోమవారం ఇక్కడ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డిమాండ్ల కోసం ఆందోళన చేపడుతున్న అంగన్‌వాడీలను ప్రభుత్వం నిర్బంధించడం దారుణమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం, అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు ఎం.శంకరమ్మ, పి.చిన్నారి, పి.ప్రభ, పి. వరలక్ష్మి, ఎస్.నారాయణమ్మ, జగదీశ్వరి, కనకమహాలక్ష్మి, ధనలక్ష్మి, ప్రియా పాల్గొన్నారు.

పాయకరావుపేట
నియోజకవర్గం

ఓటర్ల జాబితాలపై ఈఆర్వో సమావేశం

నక్కపల్లి, జనవరి 22: ఓటర్ల జాబితాల సవరణ, స్పెషల్ సమ్మరి రివిజన్‌పై తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నియోజకవర్గం రాజకీయ పార్టీల నేతలతో ఈఆర్వో కేవీ రామలక్ష్మి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నక్కపల్లి, కోటవురట్ల, పాయకరావుపేట తహసీల్దార్లు అంబేద్కర్, జానకమ్మ, జయప్రకాశ్, టీడీపీ నాయకులు కొప్పిశెట్టి వెంకటేష్,వైబోయిన రమణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, కాంగ్రెస్ నేత మేడేటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా విడుదల

ఎస్.రాయవరం: మండలంలో బీఎల్వోలు ఓటరు జాబితాలను విడుదల చేశారు. కొత్తగా 1978 నూతన ఓట్లు నమోదైనట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు. మండలంలో 60,687 ఓట్లకుగాను పురుషుల ఓట్లు 29,334, మహిళల ఓట్లు 31,351, ఇతరుల ఓట్లు రెండు ఉన్నట్టు వారు చెప్పారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

నక్కపల్లి: నక్కపల్లి, చినదొడ్డిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఎనిమిదో తరగతి విద్యార్థులకు సోమవారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. నక్కపల్లి హైస్కూల్‌లో హెచ్ఎం రాణీలలిత ఆధ్వర్యంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, ఎస్ఎంసీ చైర్మన్ పద్మ బాలికలకు టాబ్‌లు అందించారు. చినదొడ్డిగల్లులో వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ లక్ష్మణరావు, హెచ్ఎం కె.కవిత పంపిణీ చేశారు.

'అంగన్‌వాడీలను నిర్బంధించడం తగదు'

నక్కపల్లి: సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 42 రోజుల నుంచి ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలను ప్రభుత్వం నిర్బంధించడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు అన్నారు. ప్రభుత్వం, పోలీసు వైఖరికి నిరసనగా అంగన్‌వాడీలు, సీఐటీయూ కార్యకర్తలతో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు కూడా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ ఎం.రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

వీబీడబ్ల్యూఏ కన్వీనర్‌గా వీరబాబు

నక్కపల్లి: ఆర్‌టీఐ పరిధిలోని విజిల్ బ్లోయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కన్వీనర్‌గా నక్కపల్లికి చెందిన ఆర్‌టీఐ ప్రతినిధి పోలినాటి వీరబాబు నియమితులయ్యారు. అనకాపల్లిలో సోమవారం నిర్వహించిన ఆర్‌టీఐ ప్రతినిధుల సమావేశంలో అతన్ని ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షుడిగా కె.బంగార్రాజు, జిల్లా కార్యదర్శిగా దండు గణపతిరాజు, సహాయ కార్యదర్శిగా వాకపల్లి గోవిందమ్మ, ట్రెజరర్‌గా రాంబాబు నియమితులయ్యారు. సమస్యలను పరిష్కరించేందుకు అసోసియేషన్ కృషి చేస్తుందని ఈ సందర్భంగా వీరబాబు చెప్పారు.

బీసీల ద్రోహి జగన్మోహన్‌రెడ్డి

» టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు వంగలపూడి అనిత



సమావేశంలో మాట్లాడుతున్న అనిత, పక్కన నాయకులు

కోటవురట్ల, జనవరి 22: బీసీల ద్రోహి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు, నియోజకవర్గ ఇన్‌చార్జి వంగలపూడి అనిత విమర్శించారు. మండలంలోని పాములవాక గ్రామంలో సోమవారం జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీసీలకు పెద్దపీట వేసింది టీడీపీనే అన్నారు. ఎన్టీ రామారావు బడుగు బలహీన వర్గాలు, ఎస్టీ, ఎస్సీలకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారన్నారు. బీసీలకు ఎక్కువ పదవులు ఇచ్చి ఆర్థిక, సామాజికాభివృద్ధి చెందేలా చంద్రబాబు కృషి చేశారన్నారు. ప్రస్తుత సీఎం జగన్ బీసీలపై అక్రమ కేసులు బనాయించి జైలులో పెట్టి వేధించి ద్రోహిగా మారారన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. 56 బీసీ కార్పొరేషన్లు ఏర్పాటుచేసిన జగన్, బీసీలకు వ్యక్తిగత రుణాలు ఇచ్చారా అని ఆమె ప్రశ్నించారు. బీసీలకు, చేతి వృత్తిదారులకు టీడీపీ ప్రభుత్వం అనేక రుణాలు మంజూరు చేసినట్టు చెప్పారు. డ్వాక్రా మహిళల ఆర్థిక స్వాలంబన చంద్రబాబునాయుడు కృషి చేశారన్నారు. టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఆరాచక ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన ఘనుడు జగన్ అని ఆరోపించారు. ఇసుక, డీజిల్, పెట్రోల్, సిమెంట్, కరెంటు, ఇనుము, మద్యం, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచి పేదల నడ్డి విరిచిన ఘనత ఆయనదేనన్నారు. టీడీపీని అధికారంలోకి తీసుకురావడానికి బీసీలందరూ సైనికుల్లా పని చేయాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు, నాయకులు వేచలపు జనార్దన్, భాస్కరరావు, పి.లింగంనాయుడు, జీరెడ్డి నానిబాబు, సుంకర్‌బాబ్జి పాల్గొన్నారు.

ఉపాధి పథకం పనులపై తనిఖీలు నిష్పక్షపాతంగా జరగాలి

కోటవురట్ల, జనవరి 22: ఉపాధి పథకంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీలు నిష్పక్షపాతంగా జరగాలని స్టేట్ రిసోర్స్‌పర్సన్ రామారావు స్పష్టం చేశారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరలంలో పంచాయతీ కార్యదర్శులు, డీఆర్‌పీలు, సచివాలయ ఉద్యోగులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.15 కోట్లతో జరిగిన అభివృద్ధి పనులు తనఖీపై సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మండలంలోని 25 పంచాయతీల్లో జరిగిన పనులు, పింఛన్లపై మంగళవారం నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు సామాజిక తనిఖీ బృందాలు పర్యటిస్తారన్నారు. వారికి ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు సహకరించాలని కోరారు. అనంతరం వచ్చే నెల 9వ తేదిన ప్రజా వేదిక నిర్వహిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో మండల ఇంజనీర్ వర్మ, ఏపీవో గంగునాయుడు, డీఆర్‌పీలు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలపై ప్రజా వేదిక

ఎలమంచిలి, జనవరి 22: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై చేపట్టిన సామాజిక తనిఖీలపై సోమవారం ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ బోదెపు గోవింద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ అదనపు పీడీ రోజారాణి, విజిలెన్స్ అధికారిణి నిర్మలా, క్లస్టర్ అధికారి శ్రీనివాస్, ఎంపీడీవో అప్పలనాయుడులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనుల నివేదికను చదివి వినిపించారు. గ్రామాల్లో ఈ నెల 2 నుంచి 12వ తేదీ వరకూ సామాజికత నిఖీ నిర్వహించినట్టు అదనపు పీడీ తెలిపారు. 583 పనులకుగాను సుమారు 5.25 కోట్ల రూపాయలు, మెటీరియల్ రూపంలో రూ.4.15 లక్షలు ఖర్చు చేసినట్టు నివేదికలో తెలిపారు. మస్టర్ నిర్వహణలో దిద్దుబాట్లు ఉన్నాయని, కొలతల రికార్డులలో వ్యత్యాసం ఉందని, తప్పులు మరోసారి చోటు చేసుకోకుండా నిర్వహించాలని అదనపు పీడీ సూచించారు.

జిల్లా కాంగ్రెస్ సమావేశానికి తరలిరండి

పాయకరావుపేట, జనవరి 22: అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ సమావేశానికి పార్టీ శ్రేణులు తరలిరావాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాస్ కోరారు. సోమవారం పాయకరావుపేటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షురాలిగా నియమితులైన వైఎస్.షర్మిల ఈ నెల 24న అనకాపల్లిలో జరిగే సమావేశానికి హాజరవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారుతి నారాయణచక్రవర్తి, మోర్త సింహాచలం, ప్రగడ చక్రరావు పాల్గొన్నారు.

24న బంద్‌ను జయప్రదం చేయండి

పాయకరావుపేట, జనవరి 22: అంగన్‌వాడీలకు మద్దతుగా ఈ నెల 24న జరిగే బంద్‌లో అన్ని వర్గాలు పాల్గొని విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు పిలుపునిచ్చారు. ప్రభుత్వం నిరంకుశ వైఖరిని అందరూ ఖండించాలని ఆయన కోరారు.





నక్కపల్లి: వేంపాడులో అక్షితల ఊరేగింపు... ఎలమంచిలి: పల్లకీలో సీతారాముల ఊరేగింపు దృశ్యం

అంతా రామమయం...

ఎలమంచిలి/పాయకరావుపేట/పాయకరావుపేట రూరల్/కోటవురట్ల/ఎస్.రాయవరం/నక్కపల్లి/అచ్యుతాపురం/అచ్యుతాపురం రూరల్/రాంబిల్లి, జనవరి 22: అయోధ్యలో బాల రాముని ప్రతిష్ఠ సందర్భంగా గ్రామాల్లోని రామాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. పాయకరావుపేట, ఎలమంచిలి నియోజకవర్గ కేంద్రాలతో పాటు కోటవురట్ల, ఎస్.రాయవరం, నక్కపల్లి, అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో సీతారాముల ఉత్సవ విగ్రహాలను వైభవంగా ఊరేగించారు. ఈ సందర్భంగా రామ నామ స్మరణతో గ్రామాలు హోరెత్తాయి. ఉపమాక గ్రామంలో వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి గ్రామంలో ఇంటింటా అక్షతలు పంపిణీ చేశారు. సీహెచ్ఎల్‌పురం గ్రామంలో సీతారాములవారి ఉత్సవమూర్తుల ఊరేగింపు కన్నులపండువగా జరిగింది. పాయకరావుపేటలోని పాండురంగస్వామి ఆలయంలో ఉదయం ఆలయ ప్రధానార్యకులు యి.కృష్ణస్వామి ఆధ్వర్యంలో అర్చకులు పాండురంగస్వామి అమ్మవార్ల ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను సీతారాములుగా అలంకరించి శోభాయాత్ర, అనంతరం సహస్ర కదలీ ఫల అర్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఎన్.వెంకటాద్రి పాల్గొన్నారు. కోటవురట్ల మండలంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పాములవాక రామాలయం వద్ద హరిభజనలు నిర్వహించారు.మహిళలు రామనామాన్ని ఆలపిస్తూ భజనలు చేశారు. ఎలమంచిలి పట్టణంతో పాటు గ్రామాలు శ్రీరామ నామంతో మార్మోగిపోయాయి. తెరువుపల్లిలో మహిళలు బెల్లం దిమ్మలతో సీతారాములను పల్లకీలో గ్రామ వీధుల్లో ఊరేగించారు. మునిసిపాలిటీలోని అన్ని వార్డుల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భక్తులంతా ఎలమంచిలి బస్టాండ్ జంక్షన్‌కు చేరుకుని శోభాయాత్రలో పాల్గొన్నారు. సాయంత్రం నిర్వహించిన బైక్ ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎస్.రాయవరం మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీరాముడి నామాన్ని స్మరిస్తూ పండగ జరుపుకున్నారు. రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అడ్డరోడ్డు తిమ్మాపురంలో ఉన్న ఆదర్శ, గాయిత్రి, విశ్వశాంతి, శ్రీవిద్య ప్రవేట్ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు శ్రీరామ నామాన్ని స్మరిస్తూ ర్యాలీ నిర్వహించారు. అచ్యుతాపురం మండలంలో రామనామ స్మరణతో పలు గ్రామాలు మార్మోగాయి. పూడిమడక, నునపర్తి, మోసయ్యపేట, జగ్గన్నపేట తదితర గ్రామాల్లో రామాలయాల్లో ప్రత్యేక పూజలతో పాటు గ్రామాల్లో శోభాయాత్రలు జరిగాయి. రాంబిల్లి మండలంలో ఉదయం నుంచి భక్తులు రామాలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పాయకరావుపేటలో సీతారాముల కల్యాణోత్సవం

ఎలమంచిలి
నియోజకవర్గం

పీహెచ్‌సీలో సేవలపై నోడల్ అధికారి ఆరా

మునగపాక, జనవరి 22: స్థానిక పీహెచ్‌సీని రాష్ట్ర నోడల్ అధికారి ఎల్‌బీఎస్ దేవి సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఇక్కడ అందుతున్న వైద్య సేవలపై ఆమె ఆరా తీశారు. అలాగే ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లల్లో రక్తహీనత లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి దుర్గా ప్రవల్లిక, సీహెచ్‌వో దేవకాంత, వైద్య సిబ్బంది అనురాధ, వీఎస్ఎం లక్ష్మి, ఎం.ఉమామహేష్ పాల్గొన్నారు.

'అంగన్‌వాడీలపై మొండి వైఖరి సరికాదు'

రాంబిల్లి, జనవరి 22: అంగన్‌వాడీలపై వైసీపీ ప్రభుత్వం మొండి వైఖరి అవలంభించడం సరికాదని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చింతకాయల శివాజీ, సీఐటీయూ మండల కన్వీనర్ చందక రామకృష్ణ అన్నారు. రాంబిల్లి జంక్షన్‌లో అంగన్‌వాడీలతో కలిసి ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ అంగన్‌వాడీలు చేస్తున్న పోరాటం న్యాయమైనదని, 42 రోజులుగా వారు రోడ్డెక్కినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని వాపోయారు. అంగన్‌వాడీల విషయంలో సీఎం జగన్‌రెడ్డి మాట తప్పారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిహెచ్.ప్రసాద్, ధనరాజు, పవన్, ఐద్వా నాయకురాలు నూకనత్నం పాల్గొన్నారు.

ఒప్పంద జీవోలను విడుదల చేయాలి

ఎలమంచిలి, జనవరి 22: రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపల్ కార్మికులు, ఉద్యోగులు, ప్రభుత్వం మధ్య జరిగిన చర్చల్లో ఆమోదించిన జీవోలను విడుదల చేయాలని మునిసిపల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రంగనాయులు డిమాండ్ చేశారు. స్థానిక మునిసిపల్ కార్మికులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపల్ జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె కాలానికి వేతనం ఈ నెలలోనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గనిశెట్టి ఏసుదాసు, వై.నూకరాజు, సిహెచ్.వెంకటరమణ, డి.మహేష్, ఈ.చంద్రరావు పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్లకు దరఖాస్తుల ఆహ్వానం

ఎలమంచిలి, జనవరి 22: మండల పరిధిలో ప్రజలకు న్యాయపరమైన సలహాలు, న్యాయ సహాయం అందించాలనే ఆలోచనతో ఉన్న ఔత్సాహికులు పారా లీగల్ వలంటీర్లుగా పనిచేయడానికి దరఖాస్తు చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు ఎ.సాయికుమారి తెలిపారు. ఎలమంచిలి మండల న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయానికి ఈ నెల 30లోగా దరఖాస్తు అందించాలని ఆమె సూచించారు.

శంకర్ ఫౌండేషన్ నూతన శాఖ ప్రారంభం

అచ్యుతాపురం రూరల్, జనవరి 22: గాజువాకలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతన శాఖను బ్రాండిక్స్ ఇండియా భారత భాగస్వామి దొరస్వామి సోమవారం ప్రారంభించారు. అంధత్వ నిర్మూలనకు శంకర్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీలు ఆత్మకూరి కృష్ణ కుమార్, ఎ.విజయ కుమార్, రాధాకృష్ణన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవానికి కృషి

మునగపాక, జనవరి 22: జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి కృషి చేస్తామని పీసీసీ ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాసరావు చెప్పారు. నాగులాపల్లిలోని జాతీయ బీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాండ్రేగుల చందు నివాసానికి జిల్లా నాయకులతో కలసి సోమవారం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షురాలిగా షర్మిల పగ్గాలు చేపట్టిన వెంటనే రాష్ట్రంలో చేరికలు ఊపందుకున్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు బి.శ్రీనివాస్, ఎం.నారాయణ చక్రవర్తి, పి.ఆదిబాబు, రాహుల్, దాసరి సంతోష్, రావూరి రామసత్యం, కంకణాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.


నర్సీపట్నం మండలం ఓఎల్‌పురంలోని వేడుకల్లో మహిళల కోలాటం


చోడవరంలోని ఏడమ్స్ పాఠశాల విద్యార్థులు జైశ్రీరామ్ ఆకారంలో ఏర్పడిన దృశ్యం


బుచ్చెయ్యపేటలో శ్రీరాముని శోభాయాత్ర

ఏ నోట విన్నా.. రామనామ స్మరణమే..

- అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా ఊరూరా వేడుక
- రామాలయాల్లో విశేష పూజలు.. శోభాయాత్రలు
- పలుచోట్ల మేళతాళాలు, బాజాభజంత్రీల నడుమ సారె సమర్పణ


దేవరాపల్లి రామాలయంలో భక్తుల పూజలు


చీడికాడ మండలం దిబ్బపాలెం రామాలయంలో మహిళల భజనలు


రోలుగుంట గ్రామంలో...

నర్సీపట్నం, జనవరి 22 : అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠా మహోత్సవం సందర్భంగా సోమవారం వాడవాడలా జైశ్రీరామం నినాదం మార్మోగింది. ప్రజలంతా ఆ సుముహూర్తాన టీవీల ముందు కూర్చొని ఆ అయోధ్యలోని వేడుకను కన్నులారా వీక్షించారు. నర్సీపట్టణంలో రామాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీ కల్యాణ మండపం నుంచి శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి ఆలయం వరకు శోభాయాత్రను నేత్రపర్వంగా చేపట్టారు. కోలాటం, చెక్క భజనలతో స్వామివారిని ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఊరేగించారు. సీతారాములు, లక్ష్మణుడు, హనుమంతుని వేషధారణలతో చిన్నారులు అలరించగా, శ్రీవిద్యాంజలి స్కూల్ విద్యార్థులు జై శ్రీరామం నినాదాలతో భారీ ర్యాలీగా ముందుకు సాగారు.

నర్సీపట్నం అర్బన్ : అయోధ్యలోని వేడుకను పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో గల రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చాలా చోట్ల భజనబృందాలు భక్తిగీతాలు ఆలపించాయి. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గొలుగొండ/కృష్ణాదేవిపేట : మండలంలోని రామాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గొలుగొండ, రావణాపల్లి, పాకలపాడు, చీడిగుమ్మల, కొత్తఎల్లవరం, కొత్తమల్లంపేట, పాతమల్లంపేట, జోగంపేట, గుండుపాల, ఏటిగైరంపేట, ఏఎల్‌పురం, చోద్యం, నాగాపురం, లింగంపేట, కొంగసింగి తదితర గ్రామాల్లో సీతారాముల విగ్రహాలను ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మాకవరపాలెం : అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మండలంలోని గ్రామాల్లో గల అన్ని రామాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. మాకవరపాలెం, తామరం, కొండల అగ్రహారం, భీమబోయినపాలెం, దుంగలవానిపాలెం, రామన్నపాలెం, గిడుతూరు, లచ్చన్నపాలెం తదితర గ్రామాల్లో ఈ పూజలు జరిపారు. రాచపల్లిలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు, సర్పంచ్ దంపతులు సీతారాముడు, జోగిపాత్రుడు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

చోడవరం : అయోధ్య రామాలయంలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మండలంలోని గ్రామంల్లో గల రామాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. పలుచోట్ల శోభాయాత్రలను జరిపారు. గోవాడ రామాలయంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఏడువాక సత్యారావు ఆధ్వర్యంలో పూజలు జరిపారు. రాయపురాజుపేట సర్పంచ్ బొడ్డేడ రామునాయుడు ఆధ్వర్యంలో బైక్‌లతో గ్రామాల్లో శోభాయాత్ర నిర్వహించడంతో పాటు గ్రామాల్లోని రామాలయాలకు రాముడి చిత్రపటాలను బహూకరించారు. పట్టణంలోని ఎడ్లవీధి రామమందిరంలో సోమవారం తెల్లవారుజాము నుంచి పూజా కార్యక్రమాలు, భజనలు జరిపారు. సాయంత్రం ఇంటింటి దీపాలు వెలిగించారు. పట్టణశివారు అన్నవరంలో రామభక్తుల ఆధ్వర్యంలో రామనామ జపంతో శోభాయాత్ర నిర్వహించారు. వివిధ వార్డులలోని దేవాలయాల మీదుగా నిర్వహించిన ఈ శోభాయాత్రలో భారీగా భక్తులు పాల్గొని పిండివంటలతో సారె ఊరేగించారు. ఇదిలావుంటే, పట్టణంలోని ఏడమ్స్ స్కూల్ విద్యార్థులు స్కూల్ ఆవరణలో జైశ్రీరాం ఆకారంలో ఏర్పడడంతో పాటు పలువురు సీతారామ లక్ష్మణ, ఆంజనేయుల వేషధారణలతో అలరించారు. స్కూల్ ప్రిన్సిపాల్ బద్రిమహంతి ఫాల్గుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పట్టణంలోని ఎడ్లవీధి రామాలయంలో జైశ్రీరాం పేరుతో దీపాలు వెలిగించి కీర్తనలు ఆలపించారు.

బుచ్చెయ్యపేట : అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మండల వ్యాప్తంగా భక్తులు పెద్దఎత్తున శ్రీరాముని భజనలు, పూజలు, శోభయాత్ర నిర్వహించారు. పి.భీమవరం, వడ్డాది, బుచ్చెయ్యపేట, దిబ్బిడి, గున్నెంపూడి, లోపూడి, కోమళ్లపూడి, పొట్టిదొరపాలెం, కొండపాలెం, గున్నెంపూడి, విజయరామరాజుపేట, మంగళాపురం, కందిపూడి, ఆర్.శివరామపురం, ఆర్.భీమవరం, కొండెంపూడి, కె.పి.అగ్రహారం, పెదమదీనా, నీలకంఠాపురం, రాజాం, తైపురం, చిట్టియ్యపాలెం తదితర గ్రామాల్లో భక్తులు పురవీధుల్లో స్వామి వారి శోభయాత్ర నిర్వహించారు.

రావికమతం : అయోధ్యలో వేడుకలను పురస్కరించుకుని గ్రామ గ్రామాన గల రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎటుచూసినా కోలాహల వాతావరణం కనిపించింది. కొన్నిచోట్ల శోభాయాత్రను చేపట్టారు. చిలకవానిపాలెంలో కలశాలతో ఊరేగింపు జరిపారు. తట్టబందలో నిర్మించిన రామాలయంలో విగ్రహాలను ప్రతిష్ఠించారు. విప్ ధర్మశ్రీ హాజరై రూ.లక్ష విరాళంగా ఇస్తానని ప్రకటించారు. అంతకు ముందు సర్పంచ్ గోకివాడ రమణ దంపతులు స్వామి వారి విగ్రహాలను ఊరేగించారు. నాయుకులు ముక్కా మహాలక్ష్మినాయుడు, ఎంపీపీ పైల రాజు, కంచిపాటి జగన్నాథరావులతో పాటు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రోలుగుంట : అయోధ్యలో రాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా రోలుగుంటలో సమసరతా సేవా ఫౌండేషన్, ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శ్రీరామ శోభా యాత్రను ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గ్రామాల్లోని రామాలయాల్లో విశేష పూజలు జరిపారు. కొవ్వూరులో నిర్మించిన రామాలయాన్ని విప్ కరణం ధర్మశ్రీ ప్రారంభించారు. ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ తమరాన వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల : అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా మండలంలోని అన్ని రామాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. మాడుగుల సీతారామస్వామి ఆలయంలో ఈ వేడుక మరింత ఘనంగా జరిగింది. ప్రతి వార్డు నుంచి భక్తులు వివిధ రకాల పిండివంటలతో సారెను ఊరేగింపుగా తీసుకు వచ్చి ఆలయంలో ఆదర్శ దంపతులకు నైవేద్యంగా సమర్పించారు. ఈ సందర్భంగా జరిగిన శోభాయాత్రలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : అయోధ్యలో వేడుక సందర్భంగా మండలంలోని అన్ని రామాలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. ఇక్కడి రామాలయంలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, భాస్కరరావు ఆధ్వర్యంలో బాల రాముడి ఫ్లెక్సీని ఏర్పాటు చేసి పూజలు జరిపారు. వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ సింహాచలంనాయుడు, గొర్రుపోటు రమాదేవి, మొల్లి కృష్ణమూర్తి, దీవి శంకర్, అప్పలరాజు, వెంకటపతి, రాంబాబు, జి.ఎస్.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ : మండలంలోని అన్ని గ్రామాల్లో గల రామాలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. దిబ్బపాలెంలో భక్తులు తమ ఇళ్లలో తయారు చేసిన వివిధ రకాల పిండివంటలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకు వచ్చి సీతారాములకు నైవేద్యంగా సమర్పించారు. పలు గ్రామాల్లో శోభాయాత్ర జరిపారు.

కె.కోటపాడు : అయోధ్యలో వేడుక సందర్భంగా మండలంలోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొన్నిచోట్ల శోభాయాత్రను జరిపారు. దీంతో ఎటు చూసినా కోలాహల వాతావరణం నెలకొంది. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లను చేపట్టారు.

ఓటర్ల తుది జాబితాలు విడుదల

నియోజకవర్గాల్లో తాజా వివరాలను వెల్లడించిన రెవెన్యూ అధికారులు

నర్సీపట్నం, జనవరి 22 : నియోజకవర్గంలో ఓటర్ల తుది జాబితాను నర్సీపట్నం ఆర్డీవో జయరాం సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రదర్శించారు. నియోజవర్గంలో 2,08,873 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 1,01,312, స్త్రీలు 1,07,556, థర్డ్ జెండర్స్ ఐదుగురు ఉన్నారు. ముసాయిదా ఓటరు జాబితాలో 2,05,753 ఓటర్లు ఉండగా కొత్త ఓటర్లు చేరడంతో 3,120 మంది ఓటర్లు పెరిగి 2,08,873 ఓటర్లతో తుది ఓటరు జాబితాను ఎన్నికల కమిషనర్ విడుదల చేసింది. ఈ కార్యాలయంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఏవో సూర్యనారాయణ, తహసీల్దార్ అన్నాజీరావు, ఎలక్షన్ డీటీ సుధావాణి తదితరులు పాల్గొన్నారు. మండలాల వారీగా ఓటర్ల వివరాలు ఇలా ఉన్నాయి. గొలుగొండ మండలంలో పురుషులు 19774, స్త్రీలు 20810, థర్డ్ జెండర్ లేరు, మొత్తం 40584 మంది, నాతవరం మండలంలో పురుషులు 24872, స్త్రీలు 25833, థర్డ్ జెండర్ ఒకరు, మొత్తం 50706 మంది, నర్సీపట్నం మండలంలో పురుషులు 34340, స్త్రీలు 37413, థర్డ్ జెండర్ నాలుగు, మొత్తం 71757 మంది, మాకవరపాలెం మండలంలో పురుషులు 22326, స్త్రీలు 23500, థర్డ్ జెండర్ లేరు, మొత్తం 45826 మందిగా పేర్కొన్నారు.

చోడవరం నియోజకవర్గంలో...

చోడవరం : నియోజకవర్గంలో మండలాల వారీగా ఓటర్ల వివరాలను రెవెన్యూ అధికారుల ప్రదర్శించారు. చోడవరం మండలంలో పురుషులు 34900, స్త్రీలు 36504 , థర్డ్ జెండర్ ఇద్దరు, మొత్తం 71,406, బుచ్చెయ్యపేట మండలంలో పురుషులు 24928, స్త్రీలు 26249, థర్డ్ జెండర్ ఒకరు, మొత్తం 51178, రావికమతంలో పురుషులు 26713, స్త్రీలు 28362, థర్డ్ జెండర్ ఒకరు, మొత్తం 55076, రోలుగుంట మండలంలో పురుషులు 17909, స్త్రీలు 19446, థర్డ్ జెండర్ ఇద్దరు, మొత్తం 37357గా పేర్కొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట : బూడి


సమస్యలు తెలుసుకుంటున్న డిప్యూటీ సీఎం

మాడుగుల రూరల్, జనవరి 22 : గ్రామాల అభి వృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నట్టు డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు తెలిపారు. ఎం.కోటపాడు, ఎం.కెవల్లాపురం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయం, హెల్త్ క్లినిక్ భవనాలతో పాటు, పాఠశాలలోని నాడు- నేడు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రామధర్మజ, వైస్ ఎంపీపీలు రాజారామ్, శ్రీనివాస్, సర్పంచ్‌లు శానాపతి శేషఫణి, లక్ష్మి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ శానాపతి కొండరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిర్బంధంపై ఆగ్రహ జ్వాలలు

- విజయవాడకు వెళుతున్న వారికి ఎక్కడికక్కడ అడ్డంకులు
- ప్రభుత్వ తీరును ఖండిస్తూ పలుచోట్ల ఆందోళనలు


నర్సీపట్నంలో ప్రభుత్వ దిష్టిబొమ్మని దహనం చేస్తున్న అంగన్‌వాడీలు


చోడవరంలో రోడ్డుపై బైఠాయించి ఆందోళన


బుచ్చెయ్యపేటలో పోలీసుల నిర్బంధంలో అంగన్‌వాడీ కార్యకర్తలు


గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట పోలీస్ స్టేషన్ ఎదుట నినాదాలు

నర్సీపట్నం, జనవరి 22 : విజయవాడలో దీక్షలు చేస్తున్న అంగన్‌వాడీలకు సంఘీభావం తెలిపేందుకు ఈ ప్రాంతంత నుంచి వెళుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలను రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్‌లలో అడ్డగించి పోలీస్ స్టేషన్లకు తరలించి నిర్బంధించడాన్ని నిరసిస్తూ సీఐటీయూ నాయకులు సోమవారం ఇక్కడ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. తొలుత ఎన్టీఆర్ మినీ స్టేడియం వద్ద నిరసన తెలిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా అంతా నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, రొంగల దేముడు, ఈశ్వరరావులతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

గొలుగొండ: అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం గొలుగొండలో ధర్నా నిర్వహించారు. ఆందోళనలో ఉన్న తమను విధుల్లోకి చేరాలని ప్రభుత్వం ఒత్తిడి చేయడాన్ని నిరసిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. తమ డిమాండ్లు పరిష్కరించే వరకు వెనక్కి తగ్గేది లేదని యూనియన్ నాయకురాళ్లు మంగతాయారు, భ్రమరాంబ తదితరులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ, నాతవరం మండలాలకు చెందిన అంగన్‌వాడీ ఆయాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట : ఏఎల్‌పురం సెక్టార్ పరిధిలో గల సుమారు 20మంది అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లను ఆదివారం రాత్రి నుంచి విజయవాడ ధర్నాకు వెళ్లకుండా కృష్ణాదేవిపేట పోలీసులు ఇళ్ల వద్దే అడ్డుకున్నారు. సోమవారం పోలీస్ స్టేషన్‌కు రప్పించి కొంత సమయం ఉంచి విడిచిపెట్టారు. ప్రభుత్వం, పోలీసుల తీరును అంగన్‌వాడీ కార్యకర్తలు ధనలక్ష్మి, రాజేశ్వరి, రాజకుమారి దుయ్యబట్టారు.

బుచ్చెయ్యపేట : విజయవాడలో నిరహార దీక్షలు చేస్తున్న అంగన్‌వాడీలకు సంఘీభావం తెలిపేందుకు తరలి వెళ్తున్న మండలంలోని అంగన్‌వాడీలను ఆదివారం రాత్రి నక్కపల్లి హైవేపై అడ్డగించిన పోలీసులు, బుచ్చెయ్యపేట పోలీసు స్టేషన్‌కు తరలించి నిర్బంధించారు. దీంతో ప్రభుత్వం, పోలీసుల చర్యలను వారంతా ఖండించారు. తమ డిమాండ్లను నెరవేర్చకపోగా ఆందోళనకు వెళుతున్న తమను అడ్డుకోవడం ఏమిటని సంఘం నాయకురాళ్లు ఎలిశెట్టి అమ్మాజీ, కోవెల వెంకటలక్ష్మి, ఆది వరలక్ష్మి ప్రశ్నించారు. రాత్రంతా స్టేషన్‌లోని నిర్బంధంలో ఉంచిన పోలీసులు ఉదయం వారిని విడిచిపెట్టారు.

మాడుగుల/ మాడుగుల రూరల్ : చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా మండలంలోని పలువురు అంగన్‌వాడీ వర్కర్లను అడ్డుకుని మాడుగుల పోలీస్ స్టేషన్‌కు సోమవారం తెల్లవారుజామున తీసుకొచ్చారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ నాయకుడు పైలా ప్రసాదరావు స్టేషన్‌కు వెళ్లి వారిని పరామర్శించారు. టీడీపీ నాయకులు పుప్పాల రమేశ్, రంజిత్ వర్మ, కాశీబాబు, సూరిబాబు వర్మ, నానాజీ, ఈశ్వరరావు ఉన్నారు. అనంతరం అంగన్‌వాడీలను ఎస్‌ఐ దామోదరనాయుడు విడిచిపెట్టారు.

జిల్లా ఓటర్లు 12,73,591

... 5వ పేజీ తరువాయి

వుంది. మాడుగుల మినహా మిగిలిన నియోజకవర్గాల్లో ఓటర్లురెండు లక్షలకు పైబడి వున్నారు.

అన్ని సెగ్మెంట్లలో మహిళలపై పైచేయి

జిల్లా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పురుషుల కన్నా మహిళా ఓటర్లదే పైచేయి. పురుషులు 6,20,048 మంది వుంగా, మహిళలు 6,53,505 మంది వున్నారు. మొత్తంగా పరిశీలిస్తే 33,457 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. అత్యధికంగా అనకాపల్లి సెగ్మెంట్‌లో పురుషులతో పోలిస్తే 7,404 మంది మహిళలు ఎక్కువ ఉన్నారు. అత్యల్పంగా పాయకరావుపేటలో 3,684 మంది వున్నారు. నర్సీపట్నంలో 6,244, చోడవరంలో 6,111, ఎలమంచిలిలో 5,384, మాడుగులలో 4,630 మంది మహిళా ఓటర్లు అధికంగా వున్నారు.

3,911 మంది సర్వీసు ఓటర్లు

త్రివిధ దళాలు, పారా మిలిటరీల్లో పనిచేస్తున్న వారిలో అనకాపల్లి జిల్లాకు చెందిన 3,911 మంది ఓటర్లుగా వున్నారు. అనకాపల్లి నియోజకవర్గంలో అత్యధికంగా 1,028 మంది వున్నారు. ఎలమంచిలిలో 994, చోడవరంలో 592, మాడుగులలో 554, పాయకరావుపేటలో 435, నర్సీపట్నంలో 308 మంది సర్వీసు ఓటర్లు ఉన్నారు. సర్వీసు ఓటర్లలో పురుషులు 3,844 మంది, మహిళలు 67మంది మాత్రమే వున్నారు.

జిల్లాలో 1,529 పోలింగ్ కేంద్రాలు

త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నిక కోసం జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 1,529 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. అత్యధికంగా పాయకరావుపేట నియోజకవర్గంలో 292 పోలింగ్ కేంద్రాలు వున్నాయి. నర్సీపట్నంలో 262 అనకాపల్లిలో 251, ఎలమంచిలిలో 246, చోడవరంలో 243, మాడుగులలో 235 పోలింగ్ కేంద్రాలు వున్నాయి.

అంగన్‌వాడీల తొలగింపు

... 5వ పేజీ తరువాయి

వెళుతున్న అంగన్‌వాడీలను భయభ్రాంతాలకు గురి చేసి అరెస్టు చేయడం దారుణమన్నారు. 42 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ తమ న్యాయమైన డిమాండ్లను, గతంలో పాలకులు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనకాపల్లిలో సీఐటీయూ కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా నెహ్రూచౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. నెహ్రూచౌక్‌లో మానవహారంగా ఏర్పడి రాస్తారోకో చేశారు. పరవాడలో మండల పరిషత్ జంక్షన్‌లో రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వ వేధింపు చర్యలను నిరసిస్తూ చోడవరంలో ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసనకు దిగారు. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సీఐ బి.శ్రీనివాసనరావు, ఎస్‌ఐ అప్పలనాయుడు, పోలీసు సిబ్బంది వచ్చి ఆందోళనకారులను బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బుచ్చెయ్యపేట, మాడుగుల మండలాల నుంచి విజయవాడ వెళుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలను ఆదివారం రాత్రి నక్కపల్లి వద్ద హైవేపై పోలీసులు అడ్డగించి, అక్కడి నుంచి అర్ధరాత్రి తరువాత బుచ్చెయ్యపేట, మాడుగుల పోలీసు స్టేషన్లకు తరలించి నిర్బంధించారు. నాతవరం, గొలుగొండ మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు గొలుగొండలో రాస్తారోకో చేశారు. నర్సీపట్నంలో సీఐటీయూ నాయకులు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

యోగా గురువు పోస్టులకు దరఖాస్తులు

మాడుగుల రూరల్, జనవరి 22 : ఎం.కోడూరు ప్రభుత్వ హోమియో వైద్యశాల ఆయుష్ వెల్‌నెస్ సెంటర్‌లో యోగా గురువు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. యోగాలో పీజీ లేదా డిప్లమో చేసినవారు అర్హులని పేర్కొన్నారు నెలలో పురుషులకు 32 గంటలు, స్త్రీలకు 20 గంటలు పనిదినాలుగా నిర్ణయించామని, పురుషులకు రూ.8 వేలు, స్త్రీలకు రూ.5వేలు వేతనం చెల్లిస్తామని వివరించారు. పూర్తి వివరాలకు తమను సంప్రదించాల్సిందిగా కోరారు.

ఈవీఎంపై ఐతంపూడిలో అవగాహన

బుచ్చెయ్యపేట, జనవరి 22 : ఐతంపూడిలో అధికారులు సోమవారం ఈవీఎం యంత్రంపై అవగాహన కల్పించారు. స్వయంగా ఓటు వేసి అనుమనాలను నివృత్తి చేసుకునేందుకు డమ్మీ ఈవీఎంలు ఏర్పాటు చేశారు. అర్హులంతా ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ అరుణ్ చంద్ర కోరారు. ఓటు వజ్రాయుధం వంటిదని అందరూ గుర్తించాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'స్పందన' అర్జీలకు సత్వర పరిష్కారం : ఆర్డీవో


అర్జీదారులతో మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం, జనవరి 22 : స్పందనలో వస్తున్న అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీవో జయరాం అధికారులకు సూచించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పదకొండు అర్జీలు అందాయి. ఆర్డీవో వారందరితో స్వయంగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

న్యాయ సహాయకుల కోసం దరఖాస్తులు

నర్సీపట్నం, జనవరి 22 : ప్రజలకు న్యాయ పరమైన సలహాలు, న్యాయ సహాయం చేయాలనే ఆలోచన ఉన్న ఔత్సాహికుల నుంచి పారా లీగల్ వలంటీర్లు (న్యాయ సహాయకులు)గా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు పఠాన్ సీయాజ్‌ఖాన్ సోమవారం తెలిపారు. ఈనెల 31వ తేదీలోగా నర్సీపట్నం మండల సేవాధికారి సంస్థకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు, విద్యార్హత ధ్రువీకరణ పత్రాల జెరాక్స్ కాపీలతో పాటు పాస్ పోర్టు ఫొటోను దరఖాస్తుతో జత చేయాలన్నారు. కనీస విద్యార్హత 10వ తరగతి ఉండాలని, వివిధ సేవా సంస్థలలో పని చేసిన వారికి ప్రాధాన్యం ఉంటుందని వివరించారు. ఎంపికైన అభ్యర్థులకు ఎటువంటి పారితోషకం, వేతనం ఇవ్వడం జరగదని స్పష్టం చేశారు.

28 వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గణేశ్

నర్సీపట్నం అర్బన్, జనవరి 22 : మునిసిపాలిటీ పరిధి 28వ వార్డులో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గణేశ్ సోమవారం శంకుస్థాపన చేశారు. మునిసిపల్ ఛైర్‌పర్సన్ బోడపాటి ఆదిలక్ష్మి, కమిషనర్ రవిబాబు, వైస్ ఛైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, గంటా లలిత, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

అంట్లపాలెంలో ఎన్టీఆర్ విగ్రహం ఆవిష్కరణ


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న తాతయ్యబాబు, రాజేశ్

రోలుగుంట, జనవరి 22 : మండలంలోని అంట్లపాలెంలో సోమవారం ఎన్టీఆర్ విగ్రహాన్ని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు, మల్లునాయుడులతో కలిసి మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు తనయుడు, నర్సీపట్నం మునిసిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పులమయంగా మారిందన్నారు. ఆంధ్రాకు మళ్లీ మంచిరోజులు రావాలంటే రానున్న ఎన్నికల్లో ప్రజలంతా టీడీపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు గుములూరు చంద్రమౌళితో పాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గౌరీశ్వరాలయంలో గోశాల ప్రారంభం


గోశాల ప్రారంభోత్సవంలో ధర్మశ్రీ తదితరులు

చోడవరం, జనవరి 22 : ఇక్కడి స్వయంభూ గౌరీశ్వరాలయంలో సోమవారం పవిత్ర గోశాల ప్రారంభమైంది. గొర్లె ఆదిలక్ష్మి చెల్లంనాయుడు దంపతుల సహకారంతో నిర్మించిన ఈ గోశాలను విప్ కరణం ధర్మశ్రీ, ఆధ్యాత్మిక యోగశ్రీ రామకృష్ణానంద ప్రారంభించారు. నన్నయ వర్సిటీ మాజీ వీసీ ముర్రు ముత్యాలనాయుడు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు జీవీవీఎస్‌వీ ప్రసాద్‌బాబు, ఆలయ కమిటీ ఛైర్మన్ గూనూరు సత్యనారాయణ, ఎంపీపీ గాడి కాసు, సర్పంచ్ బండి నూకాలమ్మ, అర్చకులు కొడమంచిలి చలపతిలతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయండి'


సమావేశంలో మాట్లాడుతున్న సూర్యచంద్ర

నర్సీపట్నం అర్బన్, జనవరి 22 : జనసేన బలోపేతమే అందరి లక్ష్యం కావాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన వీర సూర్యచంద్ర అన్నారు. సోమవారం ఇక్కడి ఎన్జీవో హోంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించి, రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీల విజయానికి పనిచేయాలన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆద్దేపల్లి గణేశ్, గండం దొరబాబు, మోపాడ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వేతనాల కోసం సెక్యూరిటీ గార్డుల వినతి

దేవరాపల్లి, జనవరి 22 : మండలంలోని బీఆర్. అంబేడ్కర్ గురుకుల కళాశాలలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులు వేతన బకాయిల కోసం ఎదురు చూస్తున్నారు. గత ఐదు నెలలుగా చెల్లించకపోవడంతో తమ కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్నట్టు వాపోతున్నారు. ఈ సమస్యపై ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్‌కు వినతి పత్రం అందజేశారు.